ప్రజాశక్తి

సోమవారం 8 జులై 2024 8 పేజీలు



ప్రకాశం



బాపట్ల

పంచాయతీలో తాళాల రచ్చ

- జూనియర్ అసిస్టెంట్ గదికి తాళం మీద తాళం
- చోద్యం చూస్తున్న అధికారులు



తాళం మీద తాళం వేసిఉన్న దృశ్యం

ప్రజాశక్తి-శింగరాయకొండ

శింగరాయకొండ పంచాయతీలో తాళాల రచ్చ నడుస్తోంది. దీనిపై మండలంలో పెద్దఎత్తున చర్చ సాగుతోంది. వైసిపి ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు అధికారులు, సర్పంచి చెప్పిందే చట్టం అన్నట్లుగా సాగింది. వైసిపి అధికారం కోల్పోయిన తర్వాత పరిస్థితి మారిపోయింది. కొందరు అధికారులు మారిపోయారు. దీంతో ప్రజాప్రతినిధులు తమ పెత్తనం ఎక్కడ పోతుందనే భావనలోకి వచ్చారు. అయినప్పటికీ తాము చెప్పిందే జరగాలంటూ ముందుకు అడుగులు వేస్తున్నారు. ఇటీవల జూనియర్ అసిస్టెంట్ సెలవుపై వెళ్లారు. ఆయన స్థానంలో ఇన్‌ఛార్జిని నియమించాల్సి ఉంది. లేదంటే గ్రామపంచాయతీ కార్యదర్శి ఇఒఆర్‌డి ఆధ్వర్యంలో డిఎల్‌పిఒ, డిపిఒ సహకారంతో పంచాయతీలో మార్పులు చేయాల్సి ఉంది. అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టలేదు. దీంతో పరిస్థితి దారుణంగా తయారైంది. సాక్షాత్ మంత్రి ఇలాకాలోని ఓ గ్రామ పంచాయతీలో పరిస్థితి ఇలా ఉంటే ఇక రాష్ట్రంలో ఎలా ఉందో అర్థం కాని పరిస్థితి ఉంది. సెలవుపై వెళ్లిన జూనియర్ అసిస్టెంట్ తాళాలు ఇవ్వలేదు. రికార్డులు కూడా అప్పగించలేదు. రికార్డులు, చెక్కు బుక్కులు, గ్రామ పంచాయతీకి సంబంధించిన అన్ని దస్త్రాలు ఆయన గదిలోనే ఉన్నాయి. పంచాయతీ కార్యదర్శి రామకోటయ్య ఆ గది తాళాలు కోసం ప్రయత్నిస్తున్నారు. జూనియర్ అసిస్టెంట్ అందుబాటులో లేడు. ఈ విషయం ▶ 2లో

పెరిదేపిని ఆదర్శ గ్రామంగా నిలుపుదాం

- భగత్ సింగ్ కలలుగన్న ప్రజారాజ్యం సాధిద్దాం
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు



మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి-కొండపి

రాష్ట్రంలో, జిల్లాలో పెరిదేపి గ్రామాన్ని ఆదర్శంగా నిలిపేందుకు ప్రతి ఒక్కరూ కషి చేయాలని, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి మరియు పూలే అంబేద్కర్ విజ్ఞాన కేంద్రం చారిటబుల్ ట్రస్ట్ కార్యదర్శి వి. శ్రీనివాసరావు కోరారు. మండల పరిధిలోని పెరిదేపి గ్రామంలో భగత్‌సింగ్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయ భవన నిర్మాణానికి ఆదివారం శంకుస్థాపన చేశారు. తొలుత కామ్రేడ్ ముప్పరాజు శేషయ్య స్థూపం వద్ద శేషయ్య చిత్రపటానికి, మల్లెల తెల్లయ్య (కొండయ్య) స్థూపానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రజానాట్య మండలి బృందం కోలాట ప్రదర్శనతో ర్యాలీగా వెళ్లి భగత్ సింగ్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయ భవవ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు తాళ్లూరి ప్రభుదాస్ అధ్యక్ష వహించారు. సభలో వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ కామ్రేడ్ ముప్పరాజు శేషయ్య స్ఫూర్తితో ఆయన ఆశయాలతో రాష్ట్రంలో, జిల్లాలో, పెరిదేపి గ్రామాన్ని ఆదర్శంగా నిలిపేందుకు ముందుకొస్తున్న యువతకు అభినందనలు తెలిపారు. పెరిదేపిలో చాలా కాలం నుంచి ఇళ్ల స్థలాల కోసం పోరాడుతూ వారి సమస్యను వారే పరిష్కరించుకొని ఇళ్ల స్థలాలు సాధించడం గొప్ప విషయమన్నారు. గ్రామంలో మూడుతరాల నుంచి సిపిఎంలో పనిచేస్తున్న అనేక మంది ఉన్నట్లు తెలిపారు. వారి స్ఫూర్తితో భగత్ సింగ్ వెల్ఫేర్ అసోసి9యేషన్ స్థాపించటం గొప్ప విషయమన్నారు. సమానత్వం కోసం పోరాటం, నిలదీసే తత్తత్వం వచ్చినప్పుడే భగత్‌సింగ్ కలలు కన్నా రాజ్యం దక్కుతుందన్నారు. రాష్ట్రం ఆర్థికంగా అభివద్ధి చెందాలంటే ప్రత్యేక హోదా సాధ్యమని తెలిపారు. రాష్ట్రంలో ఏ ప్రభుత్వం వచ్చిన సంక్షేమ ఫలాలు అందిస్తున్నట్లు నటించి పన్నుల భారం రూపంలో ప్రజల నడ్డి విరుస్తున్నారన్నారు. పన్నుల భారం ▶ 2లో

ప్రజల జీవన ప్రమాణాలు పెరగడం వల్లే

చైనా అభివృద్ధి సాధించింది

మార్క్సిస్టు పత్రిక సంపాదకులు ఎస్.వెంకట్రావు



మాట్లాడుతున్న మార్క్సిస్టు పత్రిక సంపాదకులు ఎస్.వెంకట్రావు

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

చైనా దేశంలో ప్రజల జీవన ప్రమాణాలు పెరగడం వల్లే ఆదేశం అమెరికా కంటే మిన్నగా అభివృద్ధి సాధించినట్లు మార్క్సిస్టు పత్రిక సంపాదకులు ఎస్. వెంకట్రావు పేర్కొన్నారు. ఒంగోలు నగర అభివృద్ధి కమిటీ నాయకులు, వారి మిత్రులతో కూడిన 11 మంది బృదం ఇటీవల చైనా, వియాత్నం దేశాలలో పర్యటించింది. ఈ నేపథ్యంలో చైనా, వియాత్నం అభివృద్ధి -పర్యటన విశేషాలు అనే అంశంపై ఆదివారం సాయంత్రం స్థానిక సుందరయ్యభవన్‌లో సెమినార్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నగర అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మారెళ్ల సుబ్బారావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎస్.వెంకట్రావు మాట్లాడుతూ చైనాలో ప్రజల జీవన ప్రమాణాలు పెరిగేందుకు అక్కడ సోషలిస్టు ప్రభుత్వాలు తోడ్పాటునందిస్తున్నాయని చెప్పారు. పర్యావసానంగా ఉత్పత్తి పెరుగుదల, ప్రజల కొనుగోలు శక్తి పెరిగి చైనా అన్నీ రంగాలలో ముందంజలో ఉందన్నారు. మహిళలు, పురుషులనే భేదాలు లేకుండా అక్కడ అన్నీ రంగాల్లో ప్రజలు పోటీ పడి పని చేస్తున్నారని తెలిపారు. చైనా కంటే భాతర దేశ జనాభా పది లక్షలు ఎక్కువగా ఉన్నారని, వైశాల్యం రీత్యా చైనా మన కంటే ఎక్కువగా ఉందని వివరించారు. మన తలసరి ఆదాయం 76.75 శాతం ఉంటే చైనా తలసరి ఆదాయం 95 శాతం ఉందన్నారు. విద్యా, వైద్య రంగాలలో చైనా ప్రజలకు మంచి సేవలు అందుతున్నాయని వివరించారు. జిడిపిలో ఇండియా కంటే ఆరుశాతం ఎక్కువ వృద్ధి చైనాలో ఉందని తెలిపారు. సాగునీటిని వాళ్ళ సక్రమంగా సద్వినియోగం చేసుకుంటున్నారని, అందుకే ఆహార ధాన్యాల ఉత్పత్తి కూడా అక్కడ బాగా జరుగుతుందన్నారు. అక్కడ వ్యక్తుల పూజ లేదని, శ్రమను నమ్ముకొని ప్రజలు బతుకుతారని తెలిపారు. చైనాలో కేవలం 12 సూత్రాల ప్రమాణికంగా ప్రజల జీవన విధానం ఉంటుందన్నారు. ఈ 12 సూత్రాల ప్రమాణికంగానే అక్కడ పాలన, ప్రజల క్రమశిక్షణ ఉంటుందన్నారు. రోడ్లు, బిల్డింగ్‌లు, పార్కులు గణనీయంగా అభివృద్ధి చెందాయన్నారు. గ్రీనరీని ఎంతగానో అభివృద్ధి చేసి పొల్యూషన్ లేని నగరాలు, పట్టణాలు నిర్మించారని తెలిపారు. బుల్లెట్ రైళ్లు చైనా దేశమంతా అందుబాటులో ఉన్నాయని తెలిపారు. దీంతో అక్కడ రవాణా రంగం బాగా దూసుకుపోతుందని తెలిపారు. హోటళ్లు, రైల్వే స్టేషన్లు, విమాన శ్రయాలు ఎంతగానో అభివృద్ధి చెందాయని తెలిపారు. పేద కుటుంబాలు చైనాలో ఎక్కడా కనిపించడం లేదని, ప్రజల జీవన ప్రమాణాలు పెరగడం వల్ల అక్కడ పేదరికం తగ్గిందని తెలిపారు. ప్రతి నీటి బొట్టును వినియోగంచుకోవడం, సోలార్ విద్యుత్తును ఉపయోగించు కోవడం చైనా అభివృద్ధిలో మంచి పరిణామాలని చెప్పారు. అక్కడ ▶ 8లో

పెరిదేపిని ఆదర్శ గ్రామంగా నిలుపుదాం

(మొదటి పేజీ తరువాయి)

మోపకుండా ప్రజలకు సంక్షేమ ఫలాలు అందించినప్పుడే అది నిజమైన రాజ్యం అవుతుందన్నారు. గత వైసిపి ప్రభుత్వ హయాంలో ప్రజలకు అనేక సంక్షేమ ఫలాలు అందిస్తున్నట్లు అందించి అన్ని ధరలు పెంచి ప్రజలపై భారాలు మోపినట్లు తెలిపారు. ఫలితంగా సార్వత్రిక ఎన్నికలలో ప్రజలు గట్టి తీర్పు ఇచ్చినట్లు తెలిపారు. ప్రధాని మోడీ కూడా అయోధ్యలో రామమందిరం స్థాపించామని అందువల్ల ఎక్కువ సీట్లు వస్తాయని ఆశించినట్లు తెలిపారు. అయితే ప్రజలు తగిన బుద్ధి చెప్పారన్నారు. అనంతరం ఇళ్ల స్థలాల కోసం పోరాడిన వారిని శాలువాలతో ఘనంగా సత్కరించారు భాషజలాలు అనే పుస్తకాన్ని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో భగత్ సింగ్ అసోసియేషన్ సంస్థ నాయకులు మల్లెల రమేష్, తాళ్లూరి ప్రభుదాసు, తాళ్లూరి బ్రహ్మయ్య, లక్కెపోగు ఆశీర్వాదం, లక్కెపోగు ముసలయ్య, మల్లెల ప్రభుదాసు, మల్లెల ఆశీర్వాదం, బుల్లిరాజు, అంగలకుర్తి కోటేశ్వరరావు, జివి. రత్నాకర్, కపాకర్ మాదిగ, సిఐటియు ఉపాధ్యక్షుడు ఎస్‌డి.హనీఫ్, కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆంద్ర మాల్యాద్రి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు, భగత్ సింగ్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు మల్లెల రమేష్, తాళ్లూరి ప్రభుదాసు, అంగలకుర్తి లక్ష్మయ్య, టి.బ్రహ్మయ్య, ఎల్.ఆశీర్వాదం, సిఐటియు నెల్లూరు జిల్లా నాయకులు గంటనపల్లి వెంకటేశ్వర్లు, రైతు సంఘం నాయకులు, గ్రామ నాయకులు రాయపాటి వెంకట్రావు, చెన్నారెడ్డి వెంకటేశ్వర్లు, మార్పురి వెంకటేశ్వర్లు, జి.శ్రీనివాసులు, సిపిఎం గ్రామ నాయకులు కెజి. మస్తాన్, ఏసుదాసు, అంగలకుర్తి బ్రహ్మయ్య, మల్లెల కొండయ్య, అంగలకుర్తి జాబులు, వినుకొల్లు విజయమ్మ, కంకణాల రమాదేవి, సిహెచ్.వినోద్ పాల్గొన్నారు.

సిపిఎం జెండా ఆవిష్కరణ

పేదల సమస్య పరిష్కారం కోసం సిపిఎం ఎప్పుడూ ముందు ఉంటుందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు తెలిపారు. మండల పరిధిలోని పెరిదేపి గ్రామంలో సిపిఎం జిల్లా కార్యదర్శి హనీఫ్ పార్టీ జెండాను ఎగరవేశారు. ఈ సందర్భంగా వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ పోరాటల గడ్డ పెరిదేపి గ్రామమని తెలిపారు. అనేక సమస్యల పరిష్కారం కోసం పోరాడి సాధించుకున్నట్లు తెలిపారు. ఇళ్ల స్థలాలు, ముసినదికి సాగర్ నీరు ఇలా అనేక సమస్యల పరిష్కారం కోసం పోరాడి సాధించుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు కంకణాల ఆంజనేయులు, కెజి.మస్తాన్, సిపిఎం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భార్గవ్‌కు న్యాయ శాస్త్రంలో డిగ్రీ పట్టా

ప్రజాశక్తి-శింగరాయకొండ



డిగ్రీ పట్టా తీసుకుంటున్న భార్గవ్

తెలుగు దేశం పార్టీ ఒంగోలు పార్లమెంట్ లీగల్ సెల్ అధ్యక్షులు, సీనియర్ న్యాయవాది శింగరాయకొండ మండలం మూలగుంటపాడు గ్రామానికి చెందిన సన్నెబోయిన శ్రీనివాసులు నాయుడు కుమారుడు సన్నెబోయిన భార్గవ్ హైకోర్టు జడ్జి చేతుల మీదుగా న్యాయశాస్త్రంలో డిగ్రీ పట్టా అందుకున్నారు. ఈయన విజయవాడ విడి సిద్ధార్థ న్యాయ కళాశాలలో న్యాయ శాస్త్రంలో డిగ్రీ పూర్తి చేసుకున్నారు. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి డాక్టర్ విఆర్‌కె కృపా సాగర్ చేతుల మీదుగా న్యాయశాస్త్రంలో డిగ్రీ పట్టా అందుకున్నాడు.

ఆలయంలో అసెంబ్లీ చీఫ్ సెక్రటరీ

ప్రజాశక్తి-సిఎస్ పురం

మిట్టపాలెం నారాయణస్వామి ఆలయంలో అసెంబ్లీ జాయింట్ సెక్రటరీ పాలకొలను సుబ్బారెడ్డి, చంద్రకళ ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారిపంచామత అభిషేకంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ వ్యవస్థాపక ఛైర్మన్ కొమ్మినేని చిన్నఆదినారాయణ, ఇఓ గిరీరాజు, నరసింహాబాబులు స్వామి వారి శేష వస్త్రాలతో వారిని సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కొమ్మినేని వెంకట్రావు, మధు తదితరులు పాల్గొన్నారు.



వెంకటేశ్వరరెడ్డిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

వెంకటేశ్వరరెడ్డి సేవలు అభినందనీయం

ప్రజాశక్తి-కనిగిరి: వీరంరెడ్డి వెంకటేశ్వరరెడ్డి సేవలు అభినందనీయమని యుటిఎఫ్ రాష్ట్ర నాయకుడు మీగడ వెంకటేశ్వర్ రెడ్డి తెలిపారు. కనిగిరి మున్సిపాలిటీ పరిధి లోని చింతలపాలెం ఎస్‌సి కాలనీలో ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్ఎంగా పనిచేస్తూ ఉద్యోగ విరమణ చేసిన వెంకటేశ్వరరెడ్డికి ఆదివారం సన్మానసభ ఆదివారం నిర్వహించారు. విశ్రాంత ఎంఇఒ వీరంరెడ్డి నాగిరెడ్డి అధ్యక్షతన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా మీగడ వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ వీరంరెడ్డి వెంకటేశ్వరరెడ్డి తాను ఏ పాఠశాలలో పనిచేసినప్పటికీ గ్రామస్తులతో మమేకమై ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేశారన్నారు. అనంతరం వెంకటేశ్వరరెడ్డి దంపతులను ఘనంగా సన్మానించారు. పూర్వ ఎంఇఒ మూలె బ్రహ్మారెడ్డి, యుటిఎఫ్ జిల్లా నాయకులు మద్దాల రాము, నరసింహం, గౌస్, ఐసిడిఎస్ సూపర్ వైజర్ శివపార్వతి, వెంకటేశ్వరరెడ్డి శిష్యులు కేటి రమేష్, ఉమామహేశ్వరి, స్వర్ణలత, ఉపాధ్యాయుడు చాంద్‌బాషా, ఖజా నా శాఖ ఉద్యోగి నరసింహులు, మాజీసైనికుడు వెంకటేశ్వరరెడ్డి, విజయభారతి పాల్గొన్నారు.



నివాళి అర్పిస్తున్న దృశ్యం

సవాడారెడ్డికి నివాళి

ప్రజాశక్తి-శింగరాయకొండ: కుర్రా సవాడారెడ్డి 27వ వర్ధంతి శింగరాయకొండ మండలం పాకల గ్రామంలో ఆదివారం జి బాలకోటయ్య అధ్యక్షతన జరిగింది. సవాడారెడ్డి చిత్రపటానికి సీనియర్ నాయకులు గొల్లపోతు స్వాములు, మాకా అంకయ్య పూలమాల వేశారు. ఈ వర్ధంతి సభకు ముఖ్యఅతిథిగా హాజరైన సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కె వీరారెడ్డి మాట్లాడుతూ సవాడారెడ్డి కందుకూరు, కొండేపి నియోజకవర్గాలలో భారత కమ్యూనిస్టు పార్టీని గ్రామ గ్రామాన విస్తరించటంలో ఎంతో కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ కొండేపి మండల కార్యదర్శి ఆర్ లక్ష్మి, సుబ్బారావు, కృపారావు, రమేష్, వెంకటేశ్వర్లు, భూలక్ష్మి, సుశీల, వెంకటసుబ్బమ్మ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీలో తాళాల రచ్చ

(మొదటి పేజీ తరువాయి)

గురించి అధికారులకు లేఖ రాశాడు. జూనియర్ అసిస్టెంట్ అందుబాటులో లేనందున ఆయన గది తాళాలు పగలగొట్టి రికార్డులు స్వాధీనం చేసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటికి రెండు సార్లు ఆదేశాలు జారీ చేశారు. అయినప్పటికీ తాళాలు పగులగొట్టి రికార్డులు స్వాధీనం చేసు కొనేందుకు కార్యదర్శికి అడ్డంకులు ఎదురవు తున్నాయి. జూనియర్ అసిస్టెంట్ కొన్ని రికార్డులు తీసుకెళ్లారని సర్పంచి తాటిపర్తి వనజ అధికారులకు లేఖ రాశారు. అనంతరం జూనియర్ అసిస్టెంట్ గదికి సర్పంచి తాటిపర్తి వనజ కూడా తాళం వేశారు. అధికారులు తాళాలు పగలగొట్టమంటే సర్పంచి తాళాలు వేయటం ఏమిటని ఇక్కడ చర్చ సాగుతోంది. పంచాయతీ కార్యదర్శి రామకోటయ్య జూనియర్ అసిస్టెంట్ గదితలాలు పగలగొట్టేందుకు పోలీసులను ఆశ్రయించారు. తలాలు పగలగొట్టడానికి ఎలాంటి అభ్యంతరాలు లేవని అవసరమైతే తాము వస్తామని పోలీసులు తెలిపారు. అయితే సర్పంచి తాటిపర్తి వనజా వచ్చి ఆ తాళం మీద మరో తాళం వేశారు. ఇటీవల వచ్చి గుమస్తా రికార్డులు తీసుకెళ్లారని, ఆ విషయం తేలే వరకూ తాము వేసిన తాళం తీయమని, ఎవరూ అడ్డు వస్తారో చూస్తామని సర్పంచి హెచ్చరిస్తున్నారు. ఈ క్రమంలో కార్యదర్శి రామకోటయ్య సర్పంచి చేసింది కరెక్టేనంటే వంత పాడటం కూడా చర్చకు తావిస్తోంది. తాళాల విషయం గురించి మండల స్థాయి అధికారుల దృష్టికి వెళ్లినప్పటికీ తాము తమ సొంత జిల్లాలకు బదిలీపై పోయేముందు ఈ తాళాల రచ్చ తమకెందుకు అన్నట్లుగా వారు పట్టించుకోవడం లేదు. జిల్లా అధికారులు సైతం పట్టించుకోవడం లేదు. వైసిపి, టిడిపి మధ్య తాళాల రచ్చ జరుగుతోంది. తాళాల రచ్చలో తాము ఎక్కడ బలైపోతామోనని కొందరు అధికారులు ఆవేదనకు గురవుతున్నారు. ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు జూనియర్ అసిస్టెంట్ గది తాళాలు తీయాల్సిన అధికారులు చూస్తూ ఉండటం చర్చకు తావిస్తుండగా, అదే సమయంలో సర్పంచి జూనియర్ అసిస్టెంట్ గదికి మరో తాళం వేయడంపై పెద్ద ఎత్తున చర్చ నడుస్తోంది. ఇప్పటికైనా జిల్లా స్థాయి అధికారులు జోక్యం చేసుకొని తాళాల రచ్చకు బ్రేకులు వేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

12న మండల సమావేశం

ప్రజాశక్తి-సిఎస్‌పురం

ఈ నెల 12వ తేదీ శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ మూడమంచు వెంకటేశ్వర్లు అధ్యక్షతన ఉదయం 11గంటలకు స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో జరుగుతుందని ఇన్‌ఛార్జి ఎంపిడిఓ రామచంద్రరావు తెలిపారు. మండలంలోని జడ్‌పిటిసిలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అన్ని శాఖల అధికారులు తప్పని సరిగా హాజరు కావాలని కోరారు.

మహారాజశ్రీ అద్దంకి సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

I.A NO : 43/2023
IN
O.S NO : 108/2015

BETWEEN:
బుర్రి రమాదేవి ...... పిటిషనర్/ వాది
మరియు
కల్లి సత్యవతమ్మ (డైడ్) & ఐదుగురు
..... రెస్పాండెంట్ /ప్రతివాదులు

To
కల్లి అలేఖ్య (6th రెస్పాండెంట్)
W/o భవనం చెన్నారెడ్డి,
D/o కల్లి వీరనాగిరెడ్డి, సుబ్బారెడ్డిపాలెం గ్రామం,
ఇంకొల్లు మండలం, బాపట్ల జిల్లా.

పై నంబర్ పిటిషన్‌లో పైకోర్టు వారు మీకు ఎన్నిసార్లు నోటీసులు పంపినను తీసుకోకుండా ఇబ్బంది కలుగ చేయుచున్నందున ఈ పేపర్ ప్రకటన ద్వారా పైన తెలిపిన పిటిషన్ నోటీసులు తమకు జారీ అగునట్లుగా పైకోర్టు వారు ఉత్తర్వులు దయచేసినారు. మీకు ఏమైనా అభ్యంతరములు ఉన్నయెడల పై కోర్టులో తేది:07-08-2024 న ఉదయం 10.30 గంటలకు మీరు గాని, మీ తరఫు వకీలు గాని హాజరై తెలుపుకొనవలెను. లేనియెడల మీ పరోక్షమందు తీర్మానించబడునని తెలుసుకొనేది.

వాయిదా తేది : 07-08-2024

అద్దంకి ఇట్లు
తేది : 07-07-2024 **నాదెండ్ల హరిబాబు**
B.Com.,L. L.B.,
పిటీషనర్/ వాది తరపు న్యాయవాది
సెల్ : 9441521613

దావా సమను

మహారాజశ్రీ చీరాల ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

ఓ.ఎస్.నెంబర్ 253 ఆఫ్ 2022

బిట్వీన్ :-
కొత్తమాసు లక్ష్మి .... వాది
V/s
మువ్వల రాజేష్ ... ప్రతివాది

To
మువ్వల రాజేష్ S/o నరసింహారావు,
డోర్ నెంబర్ : 10-90,
అద్దంకమ్మ కళ్యాణ మండపం రోడ్డు,
పర్చూరు, పర్చూరు మండలం.

పై నంబర్ దావాను వాది, ప్రతి వాది అయిన మీపై ప్లయింట్ పరిహారం నిమిత్తం దాఖలు చేసినది. సదరు దావాలో మీకు దావా సమన్లు జారీ నిమిత్తం ది : 24-7-2024 వ తేదీకి వాయిదా అయి ఉన్నది. సదరు విషయమై మీకు ఏ విధమైన ఆక్షేపణలు ఉండే ఎడల సదరు వాయిదా రోజు ఉదయం 10:30 నిమిషములకు పై కోర్టు వారి ఎదుట స్వయముగాని గాని న్యాయవాది గారి ద్వారా గాని హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనియెడల మీ పరోక్షమున విచారించి తీర్మానింపబడునని తెలియ పరచడమైనది.

// కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //

ఇట్లు
పుల్లెల హరిబాబు,
బి.ఏ.ఎల్ ఎల్.బి., అడ్వకేట్
కొత్తపేట, చీరాల -523157

చెరువుమాన్యం కౌలు బహిరంగ వేలం ప్రకటన

లింగంగుంట గ్రామ పంచాయతీ

మద్దిపాడు మండలం - ప్రకాశం జిల్లా

తేది : 08-07-2024 న ప్రకాశం జిల్లా మద్దిపాడు మండలం లింగంగుంట గ్రామ పంచాయతీ నందు చెరువు మాన్యం సర్వేనెం: 190లో గల ఎ.21.50 సెంట్ల వ్యవసాయ భూమి కౌలుకు బహిరంగ వేలం నిర్వహించుటకు 2024-25 సంవత్సరము నందు రబీ పంట కాలమునకు ఎ.21.50 సెంట్ల కు గాను రూ. 3,00,000/- (అక్షరముల మూడు లక్షల రూపాయలు మాత్రమే) పంచాయతీ మద్దతు ధర నిర్ణయించినారు. గౌరవ డివిజనల్ పంచాయతీ అధికారి, ఒంగోలు వారి అధ్యక్షతన కౌలువేలం నిర్వహణ తేది : 18-07-2024 న ఉదయం 10-00 గంటలకు గ్రామ పంచాయతీ కార్యాలయం నందు జరుగును.

వేలంపాటకు షరతులు :

1.సర్వే నెం.190 లో గల ఎ.21.50 సెంట్ల పొలములో గల భూమికి పొజిషన్లో (ఉన్నది ఉన్నట్లుగా) బహిరంగ వేలం జరుగును.
2.వేలంపాట లో పాల్గొనువారు ధరావత్తు రూ. 5000/- (అక్షరముల ఐదు వేల రూపాయలు మాత్రమే) డిపాజిట్ కట్టవలెను. ఈ మొత్తం హెచ్చు పాట పాడిన పాటదారునికి తప్ప మిగిలిన వారికి వేలం పాట పూర్తి అయిన తదుపరి తిరిగి ఇవ్వబడును.
3.వేలం పాట యొక్క కాలం వ్యవధి రబీ పంట కాలము 2024-2025 మరియు ఒక పంటకు మాత్రమే. లీజు కాలము రబీ పంట కాలం తదుపరి ఎటువంటి పరిస్థితులలో పొడిగించబడదు.
4. వేలంపాటలో పాల్గొను వారు లింగంగుంట గ్రామ పంచాయతీకి ఎటువంటి బాకీ ఉండరాదు. అట్లు బాకీ ఉన్న వారు ఈ వేలంపాటలో పాల్గొనుటకు అనర్హులు.
5.వేలంపాటలో హెచ్చు పాటదారుడు పాట పూర్తయిన వెంటనే గ్రామ పంచాయతీ వారికి తాను చెల్లించవలసిన మొత్తం బాకీలో సగం చెల్లించి రసీదు పొందవలెను. ఇంకనూ చెల్లించవలసిన మిగిలిన మొత్తం పాట జరిగిన నాటి నుండి 3 రోజులు లోపు చెల్లించవలయును. లేనిచో పాట రద్దు చేయబడును.
6.పాట మొత్తం నగదు చెల్లించిన తదుపరి హెచ్చు పాటదారుడే స్టాంపు పేపరు తెచ్చుకొని అగ్రిమెంటు చేయించుకొనవలెను.
7.వేలంపాటలో పాడిన మొత్తం కౌలు నగదును కట్టి అగ్రిమెంటు వ్రాయించుకొనని యడల భూమిలోనికి పోవుటకు వీలులేదు.
8.కౌలు కాలములో అతివృష్టి, అనావృష్టి వంటి ఎలాంటి విపత్తులు వచ్చినా లింగంగుంట గ్రామ పంచాయతీ కార్యాలయము వారికి ఎటువంటి బాధ్యత లేదు.
9.హెచ్చు పాటపాడిన పాటదారుడు పాట పూర్తి అయిన వెంటనే సగం నగదు చెల్లించనిచో డిపాజిట్ తిరిగి యివ్వబడదు.
10.ఎటువంటి కారణము లేకుండా వేలం పాట నిర్వహణకు, వాయిదా వేయు అధికారం గ్రామ పంచాయతీ వారికి కలదు.
11.వేలంపాటలో హెచ్చు పాట దారుడు నుంచి వారి డిపాజిట్ మొత్తం రూ. 5000/- తగ్గించుకొని మిగిలిన మొత్తం కట్టించుకొనబడును.

సం// సం//
తూమాటి కళ్యాణి **షేక్ సాధక్ వలి**
పంచాయతీ సర్పంచ్, లింగంగుంట **పంచాయతీ కార్యదర్శి, లింగంగుంట**

త్రిశంకు స్వర్గంలో వాలంటీర్లు!

ప్రజాశక్తి కురిచేడు

మండలంలో గత ప్రభుత్వం వాలంటీర్ల వ్యవస్థను నెలకొల్పి ప్రతి యాభై కుటుంబాలకు ఒక వాలంటీర్‌ని నియమించింది. మొత్తం మండలంలో 15 పంచాయతీలు, 32 గ్రామాలు, 11 సచివాలయాలు ఉన్నాయి. వీటిలో 249 మంది వాలంటీర్లు గతంలో పనిచేసేవారు. వీరంతా సర్వం తామై అన్ని పనులను చక్కబెట్టేవారు. వైసిపి ప్రభుత్వం హయాంలోనే వాలంటీర్లు ప్రభుత్వానికి అనుకూలంగా పనిచేస్తున్నారని విమర్శలు రావడంతో వాలంటీర్లలో కొంతమంది స్వచ్ఛందంగా రాజీనామా చేశారు. మరికొంతమంది మండల స్థాయి వైసిపి నాయకుల ఒత్తిడితో రాజీనామాలను అధికారులకు అందచేశారు. రానున్నది తమ ప్రభుత్వమేనని, తిరిగి మిమ్మల్ని మరలా వాలంటీర్లుగా కొనసాగిస్తామని, ఇప్పుడు తాము చెప్పినట్లు రాజీనామా చేయకపోతే మీ భవిష్యత్‌కి గ్యారెంటీ చెప్పలేమని నాయకులు వాలంటీర్లను బెదిరించడంతో గత్యంతరం లేని స్థితిలో మొత్తం 175 మంది వాలంటీర్లు రాజీనామా పత్రాలను మండల స్థాయి అధికారులకు అందచేశారు. మొత్తం 249 మంది వాలంటీర్లలో 175 మంది రాజీనామా చేయగా మిగిలిన 74మంది రాజీనామాలు చేయకుండా యథావిధిగా కొనసాగుతున్నారు. గత ప్రభుత్వంలో పింఛన్ల పంపిణీ, ప్రభుత్వ పథకాలు అన్నీ వాలంటీర్ల ద్వారానే కొనసాగుతూ వచ్చేవి. కొత్త ప్రభుత్వం వచ్చిన తరువాత ఉన్న వాలంటీర్లను తొలగించకుండా వారికి ఏ పనీ అప్పచెప్పకుండా గాలిలో ఉంచారు. పింఛన్ల పంపిణీని వాలంటీర్లు చేపట్టవలసి ఉండగా ఆ పనిని సచివాలయ సిబ్బంది ద్వారా పంపిణీ చేయమని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. అలాగే రాష్ట్ర సాంఘిక సంక్షేమ, వాలంటీర్ల శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామిని వాలంటీర్లు కలువగా మీకు వచ్చిన ఇబ్బంది ఏమిలేదని, మీరు ఎప్పటిలాగానే పని చేసుకోవచ్చని హామీ ఇచ్చారు. కానీ నూతనంగా ఏర్పడ్డ మంత్రివర్గం సమావేశంలో వాలంటీర్లపై ఎలాంటి చర్చ చేయకుండానే సమావేశం ముగించారు. ఈ వాలంటీర్ల వ్యవస్థ కొనసాగిస్తారో లేక రద్దు చేస్తారో అర్థం కాకుండా ఉన్నది. మండలంలో మిగిలిపోయి ఉన్న 74మంది వాలంటీర్ల భవితవ్యమేమిటో అర్థం కావడం లేదు. దీనిపై కురిచేడు మండల పరిషత్ అభివృద్ధి అధికారి శివశంకర్‌ను ప్రజాశక్తి వివరణ కోరగా తమకు వాలంటీర్ల వ్యవస్థపై అధికారికంగా ఎలాంటి ఆదేశాలు రాలేదని, ప్రభుత్వ ఆదేశాల మేరకే తాము పనిచేస్తామని ఆయన అన్నారు.

నేడు వైఎస్ఆర్ జయంతి

ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి

ప్రజాశక్తి-దర్శి

వైసిపి ఆధ్వర్యంలో సోమవారం దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్లు స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని అన్ని గ్రామాలలో ఉన్న వైఎస్ఆర్ విగ్రహాలను శుభ్రం చేసి అక్కడ జయంతి వేడుకలు జరపాలన్నారు. దర్శిలోని గడియార స్తంభం సెంటర్, రెడ్డి కాంప్లెక్స్ వద్ద వైఎస్సార్ సెంటర్లో ఉన్న వైఎస్ఆర్ విగ్రహాల వద్ద జిల్లా పరిషత్ చైర్పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మతో పాటు తాను కార్యక్రమాల్లో పాల్గొంటారని ఆయన తెలిపారు. కావున నియోజకవర్గంలోని వైఎస్సార్ శ్రేణులు, జడ్పిటిసిలు, ఎంపిపిలు, సర్పంచులు, ఎంపిటిసిలు, మండల పార్టీ అధ్యక్షులు గ్రామ పార్టీ అధ్యక్షులు అందరూ పెద్దఎత్తున పాల్గొని కార్యక్రమాలను జయప్రదం చేయాలని కోరారు.

మిర్చి వ్యాపారిని అపహరించిన రైతుల లొంగుబాటు

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్

మండల పరిధిలోని బిరుదులనర్వ గ్రామ శివారులోని పొలాల్లో గత మూడు రోజుల క్రితం మిర్చి వ్యాపారి రాగి వెంకటరెడ్డిని కిడ్నాప్ చేసిన పది మంది రైతులు మార్కాపురం రూరల్ పోలీసు స్టేషన్‌లో లొంగిపోయారు. గొట్టిపడి య గ్రామానికి చెందిన తంగిరాల సత్యనారా యణరెడ్డి, అనబోలు గాలిరెడ్డి, అనబోలు శ్రీనివాస్‌రెడ్డి, అనబోలు గోపాల్‌రెడ్డి, అనబోలు సుబ్బారెడ్డి, నడికట్టు నారాయణరెడ్డి, మాలపాటి చిన్నల్లురెడ్డి, తుమ్మ రామలక్ష్మారెడ్డి, తుమ్మ చిన్నల్లురెడ్డి ఒక్కొక్కరుగా మార్కాపురం గ్రామీణ పోలీస్ స్టేషన్ ఎస్ఐ ఎం వెంకటేశ్వర్ నాయక్ ఎదుట లొంగిపోయారు. ఈ సందర్భంగా లొంగిపోయిన రైతులు పోలీసులు అధికారుల ఎదుట తమ గోడును వెళ్లబుచ్చుకున్నారు. ఆరుగాలం శ్రమించి వ్యవసాయాన్ని నమ్ముకొని అప్పులు చేసి మరి పెట్టుబడులు పెట్టి మిర్చి పంట సాగు చేసి తీరా పంట చేతికొచ్చిన తర్వాత వ్యాపారి వెంకట్‌రెడ్డి తమ వద్ద ఉన్న రూ.1.30 కోట్ల విలువగల మిర్చిని కొనుగోలు చేసి నగదు ఇవ్వకుండా ఎగ్గొట్టాడని, వెంకట రెడ్డిని ఎన్ని పర్యాయాలు డబ్బులు ఇవ్వమని అడుగుతున్నా స్పందించకపోవడంతో ఈ దారిని ఎంచుకున్నామన్నారు. తమకు గత్యంతరం లేక అతన్ని కిడ్నాప్ చేసి డబ్బులు ఎక్కడ ఉంచావు చెప్పాలంటూ అడిగామె తప్ప మరొక ఉద్దేశం కాదని రైతులు పోలీస్ అధికారులు ఎదుట కన్నీటి పర్యంతమయ్యారు. తాము అప్పులు తెచ్చి మరి పెట్టుబడులు పెట్టడం జరిగిందని తీరా అప్పులు ఇచ్చిన వారి వద్ద నుంచి తీవ్ర స్థాయిలో తమకు ఒత్తిడి పెరుగుతుండడం తోటి ఈ పని చేశామని వాపోయారు. తమను మిర్చి వ్యాపారి వెంకట్‌రెడ్డి నమ్మించి ఈ విధంగా మోసం చేశాడని తమ కుటుంబాలు ఆత్మహత్యలకు చేసుకునేందుకు సైతం వెనుకాడటం లేదని మీరే ఎలాగైనా న్యాయం చేయాలం టూ పోలీసు అధికారులును వేడుకుంటున్నారు. తాము తప్పు చేసినందుకు జైలు వెళ్లడం ఖాయమని తెలిసిన కూడా తమ డబ్బులు తప్పక వస్తాయనే నమ్మకంతో ఇలా వెంకట్‌రెడ్డిని అపహరించిన జరిగిందని కళ్లకుకట్టినట్లుగా రైతులు పోలీసులకు వివరించారు. దీంతో పోలీసులు లొంగిపోయిన పది మంది రైతులను మార్కాపురం కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్‌కు తరలించారు.

వైద్య శిబిరం నిర్వహణ అభినందనీయం

ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ఆస్టర్ రమేష్ హాస్పిటల్ నల్లూరి సర్వీసెస్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించడం అభినందనీయమని ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు పేర్కొన్నారు. స్థానిక 4వ డివిజన్ పరిధిలోని ఆస్టర్ రమేష్ హాస్పిటల్‌లో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే దామచర్ల ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజలకు వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో వైద్య శిబిరం ఏర్పాటు చేయటం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ ఉమ్మడి ప్రకాశం జిల్లా అధ్యక్షులు షేక్ రియాజ్, టిడిపి నాయకులు కామేపల్లి శ్రీనివాసరావు, టివి శ్రీరామమూర్తి, చిన్న వెంకటేశ్వర్లు, బండారు మదన్, డాక్టర్ నల్లూరి నితిన్, ఆస్టర్ రమేష్ హాస్పిటల్ వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.



వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దామచర్ల

హోండా షోరూమ్ ప్రారంభించిన దామచర్ల

ఒంగోలులోని మంగమూరు రోడ్డు జంక్షన్ వద్ద కొత్తగా ఏర్పాటు చేసిన శ్రీ శ్రీనివాస ఆటోమోటివ్స్ హోండా షోరూంను ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ రావు ఆదివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో షోరూం అధినేతలు మాదాల గౌతమ్, చెన్నుపాటి శ్రీనివాసరావు, టిడిపి మహిళా నాయకురాలు రావుల పద్మజ పాల్గొన్నారు.

ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆపాలని వినతి

ప్రజాశక్తి-శింగరాయకొండ

శింగరాయకొండ రైల్వే స్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆపాలని కోరుతూ ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డిని ది కందుకూరు డివిజన్ రైల్వే అసోసియేషన్ సభ్యులు ఆదివారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నవజీవన్, జనశతాబ్ది హౌరా. యశ్వంతపూర్, నర్సాపూర్, ధర్మవరం ఎక్స్‌ప్రెస్ రైళ్లు శింగరాయకొండలో నిలుపుదల చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. దీంతో స్పందించిన ఎంపీ మాగుంట మాట్లాడుతూ రైల్వే శాఖ మంత్రితో మాట్లాడి శింగరాయకొండ రైల్వే స్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్లు నిలుపుదల చేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. వినతి పత్రం అందజేసిన వారిలో అసోసియేషన్ ప్రెసిడెంట్ కొత్తూరు విజయ్ కుమార్, పివి. సుబ్బారావు, టిడిపి ఒంగోలు పార్లమెంట్ లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు సన్నెబోయిన శ్రీనివాసులు నాయుడు, పంచాయతీ వార్డు మెంబర్ పాదర్తి కోటేశ్వరరావు తదితరులు ఉన్నారు.



ఎంపీ మాగుంటకు సభ్యుల వినతి

టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

మండలంలోని కడపరాజుపల్లె గ్రామంలో వైఎస్ఆర్ 75వ జయంతి సందర్భంగా సోమవారం దోర్నాల మండల సచివాలయ కన్వీనర్ గుండారెడ్డి రమణారెడ్డి అధ్వర్యంలో మెగా టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు ఆర్గనైజర్లు పోలురాజు, నాగార్జునరెడ్డి ఆదివారం తెలిపారు. మొదటి బహుమతి రూ.30 వేలు, రెండో బహుమతి రూ.20 వేలు, మూడో బహుమతి రూ.10 వేలు, ప్రతి మ్యాచ్‌కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ ఉంటాయన్నారు. ఒకరి టీములో ఆడిన వారు మరొక టీములో ఆడరాదన్నారు. ఎవరి కిట్టు వారే తెచ్చుకోవాలన్నారు. బాల్ కమిటీ వద్దనే కొనుగోలు చేయాలని సూచించారు. ఎంట్రీ ఫీజు రూ.800 అని చెప్పారు. ఆసక్తి గల వారు తమ టీములను నమోదు చేసుకోవాలని కోరారు.

వాహన దారులు హెల్మెట్ ధరించాలి

ప్రజాశక్తి-కనిగిరి

వాహనదారులు హెల్మెట్ ధరించకపోవడంతో చాలా మంది రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోతున్నారని, హెల్మెట్ ధరించి వాహనాలు నడపటం వలన ఒక రక్షణ కవచంలా ఉపయోగపడుతుందని న్యాయవాది, మున్సిపాలిటీ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్ అన్నారు. ఆదివారం కనిగిరి పట్టణంలో హైకోర్టు ఆదేశాల మేరకు రాష్ట్ర, జిల్లా, మండల న్యాయ సేవాధికార సంస్థల ఆధ్వర్యంలో మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, న్యాయమూర్తి కె భరత్ చంద్ర నేతత్వంలో హెల్మెట్ వాడకం పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులకు హెల్మెట్ వాడకం వలన కలిగే ప్రయోజనాలను వాహనదారులకు వివరించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షులు అచ్చాల అది నర్సా రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించి తమ విలువైన ప్రాణాలు కాపాడు కోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్యానల్ న్యాయవాదులు, పారా లీగల్ వాలంటీర్లు గుడ్ హెల్ప్ ఫౌండేషన్ డైరెక్టర్ మంద్రు రమేష్ బాబు, నవ కుమార్,పోలీస్ సిబ్బంది,న్యాయ సేవధికార సంస్థ సిబ్బంది , వాహన చోదకులు తదితరులు పాల్గొన్నారు.



కేసును దర్యాప్తు చేస్తున్న దర్శి సీఐ షేక్ షమీముల్లా

మద్యంతాగి గొడవ పెట్టుకున్న అన్న..

తమ్ముడు కర్రతో కొట్టడంతో మృతి

ప్రజాశక్తి-దర్శి

దర్శి మండలంలోని రాజంపల్లి గ్రామానికి చెందిన రావులపల్లి ప్రసాద్ అనే వ్యక్తి అప్పుడప్పుడు మద్యం తాగి ఇంటికి వెళ్లి తల్లితో గొడవపడుతూ ఉంటాడు. ఆ క్రమంలో శనివారం రాత్రి సుమారు 10.30 గంటలకు ప్రసాదు మద్యం తాగి తల్లితో గొడవపడుతూ ఉండగా ప్రసాదు తమ్ముడైన బాలరాజు క్షణికావేశంలో కోపంతో పక్కనున్న కర్ర తీసుకొని ప్రసాద్‌ను తల మీద మూడుసార్లు బలంగా కొట్టాడు. దీంతో తలకు బలమైన గాయమైంది. క్షతగాత్రుడిని రాజంపల్లి గ్రామం నుంచి ఒంగోలు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకొని వచ్చి జాయిన్ చేయించారు. అయితే అతడు హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున 3:46 గంటలకు చనిపోయినట్లు వైద్యులు నిర్ధారించారు. ఆ విషయం మీద మృతుడి చెల్లెలు ఫిర్యాదు ఇవ్వగా దర్శి ఎస్ఐ కేసు నమోదు చేశారు. దర్శి సీఐ షమీముల్లా కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మెడికల్ షాపుల్లో తనిఖీ

ప్రజాశక్తి-కంభం రూరల్

పోలీసు, డ్రగ్స్ అధికారులు ఆదివారం కంభం పట్టణంలోని మెడికల్ షాపులలో ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. డాక్టర్ల ప్రిస్క్రిప్షన్ లేకుండా, ఎటువంటి రసీదులు ఇవ్వకుండా మత్తునిచ్చే టాబ్లెట్లను రెండు షాపులలో విక్రయిస్తున్నట్లు మార్కాపురం డ్రగ్ ఇన్‌స్పెక్టర్ సంధ్యారాణి తెలిపారు. వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకునేందుకు ఉన్నతాధికారులకు సమాచారం అందించినట్లు తెలిపారు. అంతేకాక మార్కాపురంలో గంజాయి సేవిస్తున్న ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకోగా కంభంలోని ఒక లాడ్జిలో మరో ముగ్గురు వ్యక్తులు గంజాయి సేవిస్తున్నట్లు సమాచారం ఇవ్వడంతో పోలీసులు ఐదుగురిని అదుపులోకి తీసుకొని కంభం పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో మార్కాపురం డిఎస్‌పి బాలసుందరరావు, మార్కాపురం ఇన్‌స్పెక్టర్ సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

నేడు వసంతరావుకు ఆత్మీయ సత్కారం

ప్రజాశక్తి-చీమకుర్తి

మండలంలోని గోనుగుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎస్ఎ ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ ఉద్యోగ్య విరమణ చేసిన బొర్రా వసంతరావుకు సోమవారం ఆత్మీయ సన్మానం చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. గోనుగుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా జిల్లా పరిషత్ చైర్ పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, సంతనూతలపాడు ఎమ్మెల్యే బిఎన్ విజయకుమార్, పలువురు ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు హాజరు కానున్నట్లు వారు తెలిపారు.

వైద్య ఖర్చులకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి-కొమరోలు

కొమరోలు మండలం, తాటిచర్ల గ్రామానికి చెందిన మేకల నరసింహులు గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నారన్న విషయాన్ని గ్రామస్తుల ద్వారా తెలుసుకున్న అమ్మ పౌండేషన్ వ్యవస్థాపకులు బోనేని వెంకటేశ్వర్లు యాదవ్ తమ సొంత నిధులతో వైద్య ఖర్చుల నిమిత్తం గ్రామస్థుల సమక్షంలో రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో మేకల పెద్ద నరసింహ, మీనిగె బొక్కయ్య, సాంసాని శ్రీనివాసులు, నల్లబోతుల వెంకటస్వామి, బాలవెంకటరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

హాస్టల్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - రేపల్లె

హాస్టల్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ డివిజన్ ఉపాధ్యక్షులు వై నవీన్ డిమాండ్ చేశారు. విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలిని రాష్ట్ర వ్యాప్తంగా హాస్టల్స్‌లో విద్యార్థుల సమస్యలు అధ్యయనం చెస్తున్నట్లు తెలిపారు. ఎస్ఎఫ్ఐ బృందం పట్టణంలోని ఎస్సీ, బీసీ బాలుర హాస్టల్లో విద్యార్థులను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. విద్యా సంవత్సరం ప్రారంభమైన నేపథ్యంలో హాస్టల్స్‌లో ఉన్న మౌలిక సదుపాయాలు, విద్యార్థులకు అమలవుతున్న మెనూ, హాస్టల్లో పారిశుద్ధ్యం, విద్యుత్తు, మంచి నీరు, ఆరోగ్యం వంటి సౌకర్యాలను పరిశీలించారు. చాలా చోట్ల వాతావరణ మార్పుల వల్ల ఇప్పుడు హాస్టల్లో విద్యార్థులు ఆనారోగ్యం పాలవుతున్నారని అన్నారు. తక్షణం హాస్టల్స్‌లో మెడికల్ చెకప్‌లు నిర్వహించాలని కోరారు. అధికారులు హాస్టల్స్ విట్ చేసి విద్యార్థుల సమస్యలు పరిష్కారం చేయాలని కోరారు. నాణ్యమైన ఆహారాన్ని అందించాలంటే నూతన ప్రభుత్వం మెనూ చార్జీలు పెంచాలని కోరారు. విద్యార్థులకు హాస్టల్లో ట్యూటర్స్‌ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ నాయకులు పి ప్రవీణ్ పాల్గొన్నారు.



పంచాయతీరాజ్ అధికారులతో ఆనందబాబు సమీక్ష

అభివృద్ధికి అధికారులు కృషి చేయాలి

ప్రజాశక్తి - వేమూరు

నియోజకవర్గంలోని వివిధ మండలాల్లోని సమస్యలు, వాటి పరిష్కారానికి అధికారులు చర్యలు చేపట్టాలని శాసన సభ్యులు నక్కా ఆనందబాబు సూచించారు. పంచాయతీ రాజ్ శాఖ ఉన్నతాధికారులు, ఆయా మండలాల అసిస్టెంట్ ఇంజనీర్లతో ఆనందబాబు ఆదివారం సమీక్షించారు. అధ్వానంగా ఉన్న రహదారులు, నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ కార్యాలయాల స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. గ్రామాల వారీగా అవసరమైన అభివృద్ధి పనుల కొరకు అధికారులు అంచనాలు రూపొందించి నివేదికలు ఇవ్వాలని కోరారు. తద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి వాటిని పరిష్కరిస్తానని అన్నారు. ప్రజలు గడిచిన ఐదేళ్లలో పడిన ఇబ్బందులను తొలగించాల్సి ఉందన్నారు. నిర్మాణ పనుల్లో ఎలాంటి అవకతవకలు లేకుండా చిత్తశుద్ధితో పనిచేసే విధంగా అధికారులు సమన్వయం కలిగి ఉండాలని పేర్కొన్నారు.

అనంతవరం మాజీ సర్పంచి మృతి

ప్రజాశక్తి - యద్దనపూడి



కామేశ్వరరావు(ఫైల్)

మండలంలోని అనంతవరం గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ నాయకులు, మాజీ సర్పంచ్ పెడవల్లి కామేశ్వరరావు (75) శనివారం రాత్రి మృతి చెందారు. ఆయనకు ఆదివారం అంత్యక్రియలు నిర్వహించారు. మృతుడు గ్రామ సర్పంచ్‌గా ఉన్న సమయంలో గ్రామంలోని యుపి పాఠశాలను అభివృద్ధి చేశారు. మృతునికి భార్య హుస్సేనమ్మ, కుమారులు శ్రీనివాసరావు, సాంబశివరావు, కుమార్తె, కోడళ్ళు, మనుమలు, మనుమరాళ్లు ఉన్నారు. మృతునికి గ్రామ నాయకులు తారక, వెంకటేశ్వర్లు, రంగా, సాంబశివరావు, ఆర్ శ్రీను, వెంకటప్పయ్య, చిన్న వెంకటేశ్వర్లు, సుబ్బారావు, గ్రామ పెద్దలు నివాళి అర్పించారు.

కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలి

ప్రజాశక్తి - కారంచేడు, పర్చూరు



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

రైతు అనుమతి లేకపోయినా కౌలు రైతులకు కౌలు గుర్తింపు కార్డులు ఇవ్వాలని కౌలు రైతు సంఘం నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కారంచేడు మండలం స్వర్ణ గ్రామంలో కౌలు రైతుల సమస్యలపై ఆదివారం ప్రచారం నిర్వహించారు. గ్రామాల్లో 80శాతంపైగా భూమిని కౌలు రైతులు సాగు చేస్తున్నారని అన్నారు. ఆరుగాలం కష్టపడి పనిచేసిన రైతు కుటుంబానికి ఏమీ మిగలడం లేదని అన్నారు. భూమిపై రైతులకు ఇచ్చే అన్ని రాయితీలు వాస్తవ భూమి హక్కుదారైన రైతుకు అందుతున్నాయని, భూమిపై కష్టపడి పనిచేస్తున్న కౌలు రైతు కుటుంబానికి బ్యాంకు రుణంగాని, రైతు భరోసా గాని, ప్రభుత్వ ఇచ్చే సబ్సిడీలు గానీ దక్కడం లేదని అన్నారు. అందువల్ల కౌలు రైతులు అప్పులపాలై ఆత్మహత్యలకు పాల్పడుతున్న ఘటనలు రోజూ పత్రికల్లో వస్తున్నాయని చెప్పారు. కౌలు రైతులను ఆదుకోవాలంటే 2019కి ముందు ఉన్నట్లు వ్యవసాయ అధికారులు కౌలుదారుని గుర్తించి కౌలుదారునికి గుర్తింపు కార్డులు ఇచ్చారని గుర్తు చేశారు. ఇందుకోసం జూలై 11న కారంచేడు తహశీల్దారుకు, వ్యవసాయ అధికారులకు వినతి పత్రాలు ఇవ్వడానికి కౌలు రైతులందరూ తరలిరావాలని కౌలు రైతు సంఘం స్వర్ణ గ్రామ కమిటీ ఆధ్వర్యంలో వీధి వీధినా ప్రచార నిర్వహించారు. గ్రామ కూడల్లో గ్రూపు మీటింగులు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ కౌలు రైతు సంఘం నాయకులు పి ఏడుకొండలు, హనుమంతరావు, శ్రీనివాసరావు, సుబ్బారావు, జిల్లా నాయకులు ఎం బాబురావు, పి కొండయ్య పాల్గొన్నారు.

మహిళా ఉద్యమ మణిపూస 'మానికొండ'

ప్రజాశక్తి - వేటపాలెం



మానికొండ సూర్యవతికి నివాళి అర్పిస్తున్న మహిళా నేతలు

మహిళా ఉద్యమంలో మణిపూస మానికొండ సూర్యవతి అని పలువురు వక్తలు కొనియాడారు. మండలంలోని దేశాయిపేట పంచాయతీ సిలోన్ కాలనీలో మానికొండ సూర్యవతి 31వ వర్ధంతి ఆదివారం నిర్వహించారు. సభకు సెల్వి అధ్యక్షత వహించారు. సభలో మానికొండ సూర్యవతి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా నాయకులు టి సుభాషిణి, ఎన్ లక్ష్మి మాట్లాడారు. సూర్యవతి స్వాతంత్ర్య ఉద్యమంలో పని చేస్తూ మహిళల సమస్యలపై పోరాటం చేశారని అన్నారు. 1936లో గ్రామీణ స్త్రీల సమస్యలను అధ్యయనం చేసి మహిళలను చైతన్యపరిచేందుకు మహిళా సంఘం ఏర్పాటు చేయాలనే సంకల్పంతోనే 1936లో తూర్పు కృష్ణాలో 56మంది సభ్యులతో మహిళా సంఘం ఏర్పాటు చేశారని అన్నారు. 1942లో కృష్ణా జిల్లా గరికపర్రులో జరిగిన మహాసభలో సూర్యవతి కార్యదర్శిగా ఎన్నికయ్యారు. స్త్రీలకు విద్యా సౌకర్యాలు కల్పించాలని, పురుషులతో సమాన కూలి ఇవ్వాలని, ఆస్తి హక్కు కల్పించాలని, మరుగుదొడ్లు, ప్రసూతి ఆసుపత్రులు కట్టించాలని మహాసభల్లో తీర్మానాలు చేసి బ్రిటిష్ ప్రభుత్వానికి పంపారు. సూర్యవతి 1950లో నందమూరి పంచాయతీ ఎన్నికల్లో మూడుసార్లు ప్రెసిడెంట్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని, 1958లో ఎమ్మెల్సీగా, ఎన్నికై శాసన మండలిలో ప్రజా సమస్యలను ప్రస్తావించి వాటి పరిష్కారం కోసం కృషి చేశారని అన్నారు. 1987లో ఉంగుటూరు మండల అధ్యక్షురాలుగా ఎన్నికయ్యారని అన్నారు. అప్పటి గ్రామాల్లో మరుగుదొడ్ల సమస్య తీవ్రంగా ఉండేదని, సూర్యవతి 1810 వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మాణం చేపట్టారని అన్నారు. నిధుల కోసం అనారోగ్యానికి పక్కన పెట్టి హైదరాబాద్‌కు అనేకమార్లు తిరిగి పట్టుదలతో నిధులు మంజూరు చేయించారని అన్నారు. నిస్వార్థంగా ప్రజల సమస్యల పరిష్కారానికి అలుపెరుగని కృషి చేశారని అన్నారు. తెలంగాణ సాయుధ పోరాటం సందర్భంగా 1964లో, చైనాతో యుద్ధం జరిగినప్పుడు చంటి పిల్లల తల్లిగా ఉన్న సూర్యవతిని పిల్లల నుండి విడదీసి భర్తతో పాటు జైల్లో నిర్బంధించారని అన్నారు. 1936లో 56మందితో ఏర్పడిన సంఘం నేడు దేశవ్యాప్తంగా విస్తరించిందని అన్నారు. ఆమె అడుగుజాడల్లో నిబద్ధతగా కృషి చేయడమే మనం ఆమెకు ఇచ్చే నివాళని అన్నారు. కార్యక్రమంలో శివసక్తి, జ్ఞాన సుందరి, రోజా, పరమేశ్వరి, తమిళ్ సెల్వి, ఝాన్సీరాణి, నాగదేవి పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

- ప్రజాసేవకే ఎమ్మెల్యే ఏలూరి తొలి ప్రాధాన్యం
- రాజకీయాలకతీతంగా సేవా కార్యక్రమాలు
- లక్ష మందికి శస్త్ర చికిత్సలే లక్ష్యం

ప్రజాశక్తి - మార్టూరు రూరల్



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

లక్ష మందికి కంటి శస్త్ర చికిత్స చేయించడమే లక్ష్యంగా రాజకీయాలకు అతీతంగా ఏలూరి చారిటబుల్ ట్రస్ట్, నోవా అగ్రి గ్రూప్ సంయుక్తంగా శంకర్ కంటి ఆసుపత్రి సౌజన్యంతో ఎమ్మెల్యే ఏలూరి క్యాంప్ కార్యాలయంలో ఆదివారం ఉచిత మెగా కంటి వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య శిభిరానికి విశేష స్పందన లభించింది. వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున హాజరైన పురుషులు, మహిళలకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి కంటి వైద్య పరీక్షలు చేశారు. ముందుగా ఎన్టీఆర్ విగ్రహానికి, ఏలూరి నాగేశ్వరరావు చిత్ర పటానికి పూలమాల వేసి తెలుగుదేశం నాయకులు నివాళి అర్పించారు. వైద్య శిబిరానికి 1065మంది హాజరు కాగా 465మందికి కంటి శస్త్ర చికిత్సలు అవసరమని డాక్టర్ యోగిత, డాక్టర్ యామదీప్, యామాదీప్తి తెలిపారు. అనంతరం టిడిపి బాపట్ల పార్లమెంటు ఉపాధ్యక్షులు తొండెపు ఆదినారాయణ మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా ప్రజా సేవే లక్ష్యంగా ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు తన తండ్రి ఏలూరి నాగేశ్వరరావు జ్ఞాపకార్థం ఏలూరి చారిటబుల్ ట్రస్ట్ ఏర్పాటు చేసి సేవా కార్యక్రమాలు చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రజలకు సేవ చేయాలనే లక్ష్యంతో మోకాళ్ళ ఆపరేషన్లు, ఉచిత కంటి వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నారని అన్నారు. ప్రజా ప్రతినిధిగా అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ, ట్రస్ట్ ద్వారా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. లక్ష మందికి కంటి శస్త్ర చికిత్సలే లక్ష్యంగా క్యాంపులు నిర్వహిస్తున్నామని అన్నారు. క్యాంపుకు వచ్చే వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా పటిష్ట ఏర్పాట్లు చేపట్టారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ప్రజల రాకతో ఎమ్మెల్యే ఏలూరి క్యాంప్ కార్యాలయం కిక్కిరిసింది.



శ్రీకృష్ణదేవరాయలుకు స్వాగతం పలుకుతున్న నేతలు

ఎంపీ శ్రీకృష్ణదేవరాయలుకు టిడిపి నేతల స్వాగతం

ప్రజాశక్తి- సంతమాగులూరు

సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం ఘన విజయం సాధించడం, నరసరావుపేట ఎంపీగా లావు శ్రీకృష్ణదేవరాయలు గెలుపొందడంతో నరసరావుపేట ఆక్స్ ఫర్డ్ పాఠశాల అధినేత రాజారెడ్డి ఆదివారం నరసరావుపేట నుండి తిరుపతికి మొక్కుబడి చెల్లించేందుకు పాదయాత్రగా వెళుతున్నారు. పాదయాత్ర మండలంలోని పుట్టావారిపాలెంలోని మంత్రి గొట్టిపాటి రవికుమార్ అతిథి గృహానికి చేరుకున్నారు. అక్కడ నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు రాజారెడ్డికి తమ సంఘీభావాన్ని తెలిపారు. ఈ సందర్భంగా వారిరువురికి మాజీ ఎంపీపీ సన్నెబోయిన ఏడుకొండలు, సర్పంచుల సంఘం అధ్యక్షుడు సన్నెబోయిన గురు యాదవ్, చేవూరి వాసురెడ్డి, గొట్టిపాటి చౌదరి బాబు, సురేష్, శ్రీరామమూర్తి ఘన స్వాగతం పలికి సంఘీభావం తెలిపారు.



మాట్లాడుతున్న సిఐటియు నాయకులు సుబ్బారావు

పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - కొల్లూరు

పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు మండల నాయకులు బొనిగల సుబ్బరావు కోరారు. పంచాయతీ కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు పుల్లారావు, సిఐటియు నాయకులు బొనిగల సుబ్బారావు మాట్లాడారు. కార్మికులకు ఇచ్చే చాలీ, చాలని జీతాలతో కుటుంబాలు నడపలేక అప్పులు చేయవలసిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. తాము చేసే ఈ పనికి రోగాల బారిన పడి కొన్ని కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులతో కాలం గడపాల్సి వస్తుందని అన్నారు. కరోనా సమయంలో తమ కుటుంబాలను వదిలిపెట్టి ప్రజలు ప్రాణాలకు రక్షణగా పనిచేసేమని, కానీ నేటికీ జీతలు పెంచే ఆలోచనలో ప్రభుత్వాలకు లేవని అన్నారు. రూ.26వేలు జీతం ఇవ్వాలని సుప్రీంకోర్టు చెప్పిన ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని అన్నారు. ఈఎస్ఐ, పిఎఫ్ అమలు చేయాలని, యూనిఫాంలు, నూనెలు, సబ్బులు ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా పంచాయతీ వర్కర్స్ యూనియన్ నూతనంగా ఏర్పాటు చేసినట్లు తెలిపారు.



అవార్డు అందుకుంటున్న బట్ట మోహనరావు

ఉత్తమ అధ్యక్షుడిగా మోహనరావు

ప్రజాశక్తి - వేటపాలెం

రోటరీ క్లబ్ 2023-24 సంవత్సరంలో చేసిన సేవలను గుర్తించి వేటపాలెం రోటరీ అధ్యక్షులు బట్ట మోహనరావుకు ఉత్తమ రోటరీ క్లబ్ అధ్యక్షుడిగా అవార్డు అందజేశారు. బాపట్ల రోటరీ భవన్లో ఆదివారం జరిగిన ఆత్మీయు కలయికలో రోటరీ గవర్నర్ బూసిరెడ్డి శంకరరెడ్డి చేతులు మీదుగా అవార్డు అందుకున్నారు. రోటరీ కార్యదర్శి ఎవి సురేష్ బాబు, కొత్త శ్రీనివాసరావు, నున్న నాగేంద్రరావు, సుధీర్ కుమార్ పాల్గొన్నారు.

తప్పులతడకగా 'జగనన్న భూ రక్ష'

రీ సర్వేలో ఎకరాలకు ఎకరాలు నష్టపోయిన రైతులు ● కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు ● పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి-తర్లుపాడు

జగనన్న భూ హక్కు చట్టం రైతులకు అపార నష్టం తెచ్చిపెట్టింది. భూ వివాదాల పరిష్కారం అంటూ వైసిపి ప్రభుత్వం ప్రయోగాత్మకంగా చేపట్టిన వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు- భూ రక్ష పథకంలోని సర్వే తప్పుల తడకగా మారింది. అస్తవ్యస్త భూ లెక్కలతో అన్నదాతల సమస్యలకు పరిష్కారం చూపకపోగా కొత్త భూ సమస్యలు తెచ్చిపెడుతుందని తలలు పట్టుకుంటున్నారు. తర్లుపాడు మండలంలో ఎకరాలకు ఎకరాలు భూములు కోల్పోయిన రైతులు పరిష్కారం కోసం చెప్పులు అరిగేలా కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. కొన్ని ప్రాంతాలలో రైతులు లేకుండానే అధికారులు రీ సర్వే చేపట్టడంతో భూలెక్కలలో గందరగోళం నెలకొంది. దీంతో జగనన్న భూ రక్షణ పథకం కాస్తా భూభక్షక పథకంగా మారిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. భూ రీ సర్వే అంటే కొలతల్లో చిన్నపాటి తేడా ఉండటం సహజం. ఐదు పది సెంట్లు తేడా అయితే పరవాలేదు కానీ ఎకరాలకు ఎకరాలు మాయమైందంటే జగనన్న భూ సర్వే ఫలితం అని ప్రజలు పెదవి విరుస్తున్నారు. తర్లుపాడు మండలంలో ఇదే పరిస్థితి చోటుచేసుకుంది. మండలంలోని ఓబాయపల్లి గ్రామంలో బండి వెంకట లక్ష్మమ్మకు 37/1 సర్వే నెంబర్లో 5.00 ఎకరాల భూమి ఉంది. రీ సర్వే అనంతరం 2. 38 ఎకరాలు తేడా వచ్చింది. అలాగే బండి తిరుపతమ్మకు 56/3 సర్వే నెంబర్‌లో 4.68 ఎకరాలు




1. రీసర్వేలో నష్టపోయిన పొలం పాస్ పుస్తకాన్ని చూపిస్తున్న ఎక్కంటి చిన్నపరెడ్డి
2. 45 మంది భాగస్వామ్యంతో పంపిణీ చేసిన పాస్ పుస్తకాన్ని చూపిస్తున్నరైతు బండి వెంకటేశ్వర రెడ్డి

ఉండగా, 98 సెంట్లు, 104 సర్వే నెంబర్‌లో యక్కంటి చిన్నపరెడ్డికి 1.47 ఎకరాలు ఉండగా 38 సెంట్లు, ఎక్కంటి వెంకటరమణమ్మకు సర్వే నెంబర్ 90/6లో 1.40 ఎకరాలకు గాను 16 సెంట్లు తగ్గిందని, వెంకటరమణ ఫొటోకు బదులుగా అదే గ్రామానికి చెందిన వెంకటరత్తమ్మ ఫోటో వచ్చిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులను సంప్రదిస్తే సవరణకు పెట్టుకోవాలని మొక్కుబడి సమాధానాలు చెబుతున్నారని వాపోయారు. సరైన విధానంలో సర్వే జరగకపోవడమే ఈ తప్పిదాలకు కారణమని రైతులు మండిపడుతున్నారు. ఇచ్చిన పాస్ పుస్తకాలపై ప్రభుత్వ రాజముద్ర లేకపోవడంతో భవిష్యత్తులో చెల్లుబాటుపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ప్రచార ఆర్భాటం కోసమే ఈ పథకాన్ని తీసుకొచ్చారని దూషిస్తున్నారు. డ్రోన్ల సహాయంతో తీసిన సర్వేలకు, క్షేత్రస్థాయి సర్వేలకు చాలా తేడాలు ఉంటాయని వారు తెలియజేస్తున్నారు. తర్లుపాడు మండలంలో అనేక గ్రామాలలో ఇంకా భూ హక్కు పత్రాల పంపిణీ జరగలేదు. కొందరు రైతులు భూములలో హద్దురాళ్లు ఇంకా పూర్తిగా పాత లేదు. భూ హక్కు పత్రంలో ఒకరికి బదులుగా మరొక ఫోటోలు, పేర్ల తప్పిదాలు, విస్తీర్ణంలో తేడాలు, చిరునామాలో తప్పులు, చరవాణి, ఆధార్ సంఖ్యలు తప్పు గా నమోదయ్యాయని చెబుతున్నారు. అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకునే నాథుడే కరువయ్యారని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు వాగులు, చెరువులు, కుంటలు, ఆలయ మాన్యాలు, అటవీ భూముల్లోని తేడాలు పరిగణలోకి తీసుకోవడం లేదని రైతులు వాపోతున్నారు. సర్వేలో లోపాలకు ఇదే ప్రధాన కారణమని చెబుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి జగనన్న భూ సర్వే ద్వారా రైతులకు జరిగిన అపార నష్టాన్ని పూడ్చాలని, పాస్ పుస్తకాల్లోని తప్పులను సవరించాలని, అసలు ఈ చట్టాన్నే రద్దు చేయాలని మండలంలోని రైతులు కోరుతున్నారు.

కార్మికుల కోర్కెల దినాన్ని జయప్రదం చేయండి

ప్రజాశక్తి-పామూరు

జులై 10వ తేదీన కార్మికుల దినోత్సవ సంబరాలను జరుపుకోవాలని సిఐటియు జిల్లా కార్యదర్శి కోమలపాటి మాల్యాద్రి అన్నారు. సిఐటియు అనుబంధ సంఘాల సమావేశం పప్పు వెంకోబరావు మీటింగ్ హాల్లో ఎస్కే అల్లా బక్ష అధ్యక్షతన సమావేశం జరిగింది. లోకసభ అసెంబ్లీ ఎన్నికల అనంతరం కేంద్రంలో, రాష్ట్రంలో నూతన ప్రభుత్వాలు ఏర్పడ్డాయి. ఏ ప్రభుత్వాలు వచ్చినా కార్మికులకు న్యాయం జరగటలేదని అన్నారు. లేబర్ కోడ్స్‌ను వెంటనే రద్దు చేయాలని, ప్రభుత్వ రంగ పరిశ్రమల ప్రైవేటీకరణ ఆపాలని, అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్న భోజనం, విఆర్‌ఏ, కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికుల తొలగింపులు ఆపాలన్నారు. పెన్షన్ స్కీమ్ అమలు చేయాలని, విశాఖ స్టీల్



మాట్లాడుతున్న సిఐటియు నాయకుడు మాల్యాద్రి

ప్లాంట్ అమ్మకం ఆపాలని, సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని, సామాజిక భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సివిల్ సప్లై పి శ్రీను, వీఆర్ఏ షేక్ మస్తాన్, మధ్యాహ్న భోజనం కార్మికురాలు రాజ్యలక్ష్మి, వాషర్‌మన్ సొసైటీ నాయకులు సుబ్బారావు, నారాయణ, అనిల్, గురునాథం ఎల్ పాల్గొన్నారు.



ప్రమాణం చేస్తున్న విశ్వబ్రాహ్మణ కమిటీ నాయకులు

విశ్వబ్రాహ్మణ సంఘం సర్వజన మహాసభ

ప్రజాశక్తి-హనుమంతునిపాడు

మండలంలో విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో సర్వజన మహాసభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా అధ్యక్షులు చెన్నుపల్లి శ్రీనివాసచారి పాల్గొన్నారు. అతను మాట్లాడుతూ విశ్వబ్రాహ్మణులకు రాజకీయ ప్రాధాన్యత కల్పించాలని, పార్టీలో పనిచేసిన విశ్వబ్రాహ్మణులకు నామినేట్ పదవులు ఇవ్వాలని కోరారు. వెనుకబడిన కుటుంబాలను ఆదుకోవాలని అన్నారు. అనంతరం మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షులుగా వాగుమడుగు నారాయణ చారి, ప్రధాన కార్యదర్శిగా సోడా శివ బ్రహ్మాచారి, కోశాధికారిగా పాలూరి శ్రీనివాస చారి, గౌరవ అధ్యక్షులుగా పోతురాజు వీర బ్రహ్మం, సలహాదారుడుగా ఆకుమల్ల నాగ బ్రహ్మం, సోడా మేఘనాదం, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా అచ్చయ్య, చంద్రశేఖర ఆచారి, రాజబాబు, పదిమంది కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం అధ్యక్షుడు వాగు మడుగు నారాయణచారి మాట్లాడుతూ సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో కనిగిరి అధ్యక్షులు ప్రకాష్‌రావు, రాష్ట్ర కార్యదర్శి బ్రహ్మానందం, జిల్లా కార్యదర్శి సుధాకర్, సహాయ కార్యదర్శి నిమ్మకురి మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

బాలికల వసతి గృహంలో..

వసతుల కల్పనకు కృషి: ఉగ్ర

ప్రజాశక్తి-కనిగిరి

కనిగిరి ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఉన్న సాంఘిక సంక్షేమ సమీకృత బాలికల వసతి గృహాన్ని ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.



విద్యార్థినులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర

వసతి గృహంలో మౌలిక వసతులకు కృషి చేస్తానని తెలిపారు. వసతి గృహంలో సౌకర్యాల లేమిపై బాలికలను అడిగి తెలుసుకున్నారు. వసతి గృహంలో వాడుక నీరు, తాగునీటి సౌకర్యం గురించి సంక్షేమ అధికారి ఎస్ జయంతిని అడిగి తెలుసుకున్నారు. నూట అరవై మంది విద్యార్థినులు ఉన్న వసతి గృహంలో ఆర్వో ప్లాంటు అవసరం ఉందని ఎమ్మెల్యే ఉగ్ర గుర్తించారు. వసతి గృహంలో ఉన్న గదులన్నీ బాలికలతో కలిసి తిరుగుతూ వారికి కావలసిన ఫ్యాన్లు, లైట్లు తదితర అవసరాల గురించి తెలుసుకున్నారు. ప్రతి ఒక్కరూ ప్రభుత్వ కళాశాలల్లో, పాఠశాలల్లో చదివి మెరుగైన ఫలితాలు సాధించాలని కోరారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరే విద్యార్థులకు ఆర్టీసీ బస్సులతోపాటు ఇతర మెరుగైన విద్య అందేలా చొరవ చూపుతానన్నారు. వసతి గృహానికి అవసరమైన సౌకర్యాలకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు తమ్మినేని శ్రీనివాస్‌రెడ్డి, షేక్ ఫిరోజ్, మాజీ ఎంపీపీ నంబుల వెంకటేశ్వర్లు, తమ్మినేని వెంకటరెడ్డి, బజాజ్ ఓబుల్ రెడ్డి, నాగిరెడ్డి, ఉండేల శ్రీనివాస్‌రెడ్డి, తమ్మినేని సురేందర్‌రెడ్డి, గోనుగుంట పవన్ కుమార్, యువరాజ్, గండికోట రమేష్, కోట సురేష్ బాబు, ఆర్కే గ్రాండ్ అధినేత రామకృష్ణారెడ్డి, ఎడవల్లి మనోజ్ రెడ్డి, కాకుమాని వెంకటేశ్వర్లు, షేక్ మస్తాన్ బాబు, షేక్ రెహ్మాన్ ఇతర టిడిపి నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలకు శాశ్వత పరిష్కారం

ప్రజాశక్తి-కనిగిరి

నాణ్యమైన విద్యుత్‌కు శాశ్వత పరిష్కారం ఏర్పాటు చేయనున్నట్లు కనిగిరి మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ అన్నారు. ఆదివారం సమస్య పరిష్కారం కార్యక్రమంలో భాగంగా కనిగిరి పట్టణంలోని ఏబిఎం కాంపౌండ్ ప్రాంతంలో మున్సిపల్ చైర్మన్ పర్యటించి క్షేత్రస్థాయిలో ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా చైర్మన్ అబ్దుల్ గఫార్ మాట్లాడుతూ పట్టణంలో ఏ ప్రాంతంలో లో-వోల్టేజీ వలన ప్రజలు ఇబ్బంది పడుతున్నారో ఆ ప్రాంతంలో అదనపు, కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. అలాగే పట్టణంలో విద్యుత్ సిమెంటు స్తంభాల స్థానంలో కొత్తగా టవర్ల ఏర్పాటుకు విద్యుత్ అధికారులు నివేదికలు తయారుచేసి త్వరలో పనులు ప్రారంభిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఆ ప్రాంత నాయకులు కుంచం జక్రయ్య, డాక్టర్ నాయబ్‌రసూల్, టీచర్స్ అకాడమీ అధినేత మాలాద్రిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమస్యలు తెలుసుకుంటున్న చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్



మంత్రి స్వామిని సన్మానిస్తున్న సచివాలయం డిజిటల్ అసిస్టెంట్లు

మంత్రి డాక్టర్ స్వామికి సన్మానం

ప్రజాశక్తి-శింగరాయకొండ

శింగరాయకొండ మండలంలోని సచివాలయాల డిజిటల్ అసిస్టెంట్లు ఆదివారం నాడు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామిని కలిసి ఘనంగా సన్మానించారు. మండలంలోని 15 సచివాలయాల డిజిటల్ అసిస్టెంట్లు కలిసి తమ సమస్యలను మంత్రి వివరించారు. ఈ కార్యక్రమంలో చక్రవర్తి, షేక్ అబ్దుల్, సత్తార్, పంతగాని శ్రీనివాసరావు, కిషోర్‌కుమార్, సింగూతూ శ్రీను తదితరులు ఉన్నారు.



గ్రామస్తులతో మమేకమైన ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి

కూటమి ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి-అర్ధవీడు: మండల పరిధిలోని అయ్యవారిపల్లె గ్రామపంచాయతీలో ఆదివారం కూటమి ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ముఖ్య అతిథులుగా గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్‌రెడ్డి హాజరయ్యారు. ఆయనకు మండల ప్రజలందరూ ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలందరూ తనకు ఓట్లేసి గెలిపించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. మండల ప్రజలు తనపై ఆదరాభిమానాలు చూపినందుకు తాను ఎంతో రుణపడి ఉంటానని ఎమ్మెల్యే అన్నారు. ఆయన అయ్యవారిపల్లె ప్రజలతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. మండల ప్రజల సమస్యలు త్వరలోనే పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పాల్గుల పురుషోత్తంరెడ్డి, పాల్గుల శ్రీనురెడ్డి, వెంకట్రాంరెడ్డి, కొనతం రంగారెడ్డి, మాజీ సర్పంచ్ సుబ్బారెడ్డి, మారెడ్డి రంగారెడ్డి, బండ్లమూడి ఆంజనేయులు, జి తిరుపతిరెడ్డి, జి గోపాల్ రెడ్డి, అనిల్ కుమార్‌రెడ్డి, రెహమాన్, రమణ, జీవన్‌రెడ్డి, పి చలమారెడ్డి, టిడిపి నాయకులు, కార్యకర్తలు, మండల ప్రజలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి

ప్రజల ఆదరాభిమానాలు మరువలేను: కందుల

ప్రజాశక్తి-కొనకనమిట్ల

తనకు ఓట్లు వేసి గెలిపించిన ప్రజల ఆదరాభిమానాలు మరిచిపోనని, వారి సమస్యలను పరిష్కరించే దిశగా కృషి చేస్తానని మార్కాపురం శాసన సభ్యులు కందుల నారాయణరెడ్డి అన్నారు. సిఎం చంద్ర బాబు నాయుడు రాష్ట్రాభివృద్ధికి కృషి చేస్తారని, ఎన్నికల్లో పింఛన్ పెంపు హామీని అమలు చేసి చూపించారని గుర్తు చేశారు. శనివారం రాత్రి కొనకన మిట్ల అంకాలమ్మ తిరు నాళ్లలో టిడిపి ఏర్పాటు చేసిన విద్యుత్ ప్రభలపై నుంచి ఆయన మాట్లాడారు. అమరావతి పనులు కూడా ఒక కొలిక్కి వస్తున్నాయని, త్వరలో మార్కాపురం జిల్లా అవు తుందని అన్నారు. మాజీ వైస్ ఎంపిపి సానికొమ్ము వెంకటే శ్వరరెడ్డి మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వంలోనే అభివృద్ధి జరుగుతుందని అన్నారు. తాతిరెడ్డి వెంకట్వేరరెడ్డి, కనకం నరసింహారావు, రాష్ట్ర తెలుగు యువత కార్యదర్శి కామసాని రామిరెడ్డి, బాషాపతిరెడ్డి, ముక్కాల శ్రీనివాస రెడ్డి, పునుగోటి వెంకటేశ్వరరెడ్డి, నరసింహారెడ్డి, వేంపాటి శ్రీకాంత్‌రెడ్డి, మువ్వా కాటంరాజు తదితరులు పాల్గొన్నారు.

కోర్సు ఎంపికే భవిష్యత్తుకు తొలిమెట్టు

● ఘనంగా బ్రిలియంట్ ఇంజినీరింగ్ మాక్‌వెబ్ కౌన్సెలింగ్ ● ఇంజనీరింగ్, ప్రొఫెషనల్ కాలేజీలు హాజరు ● బ్రిలియంట్ కృషి అభినందనీయమన్న ఎమ్మెల్యే దామచర్ల

ప్రజాశక్తి - ఒంగోలు

ఇంజనీరింగ్ కోర్సుల్లో బ్రాంచ్ ఎంపిక చేసుకోవడమే భవిష్యత్తుకు తొలిమెట్టని, బీటెక్‌లో ప్రతి బ్రాంచ్ ఉత్తమమైనదేనని ఎంఎల్‌ఎ దామచర్ల జనార్దన్ పేర్కొన్నారు. ఇంజినీరింగ్, మెడికల్ స్టూడెంట్స్ కోసం ఒంగోలు బ్రిలియంట్ కంప్యూటర్ సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని గుంటూరు రోడ్డులోని ఎ1 ఫంక్షన్ హాల్లో ప్రత్యేక మాక్ వెబ్ కౌన్సెలింగ్ ప్రోగ్రాం ఆదివారం ఘనంగా నిర్వహించారు. బ్రిలియంట్ సంస్థల అధినేత డాక్టర్ న్యామతుల్లా భాష సంచాలకత్వంలో నిర్వహించిన మాక్ వెబ్ కౌన్సిలింగ్‌లో వివిధ జిల్లాలు, రాష్ట్రాలకు సంబంధించిన అనేక ఇంజనీరింగ్, ఎంబీఎ, మెడికల్, ఐఎఎస్ అకాడమీలు, కళాశాల ప్రతినిధులు పాల్గొన్నారు. తొలుత ఎంఎల్‌ఎ దామచర్ల జనార్ధనరావు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. బ్రిలియంట్ విద్యా సంస్థలు ప్రతి ఏటా మాక్ వెబ్ కౌన్సిలింగ్ నిర్వహించి విద్యార్థులకు ఎంతో తోడ్పాటుగా నిలుస్తుందని అన్నారు. కోర్సుల్లో చేరిన మొదటి సెమిస్టర్ నుంచే తరగతులను సీరియస్‌గా అధ్యయనం చేయడం ద్వారా భవిష్యత్తు విద్యలో రాణిస్తారని అన్నారు. మంచి భవిష్యత్తును చేరుకుంటారని



మాక్ వెబ్‌కౌన్సెలింగ్ ప్రారంభిస్తున్న దామచర్ల జనార్దన్

అన్నారు. రిటైర్డ్ డిజిపి కెఆర్‌ఎం కిషోర్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు బాధ్యతగా చదవడం వలన కుటుంబానికే కాక దేశానికి కూడా సేవ చేస్తున్నట్లని పేర్కొన్నారు. వెబ్‌కౌన్సిలింగ్‌పై అవగాహన కల్పించారు. దేశంలోనే పేరెన్నికగన్న ఇంజినీరింగ్ కాలేజీలు, యూనివర్సిటీలు తమ విద్యా సంస్థల స్టాల్స్ ఏర్పాటు చేశారు. ఒంగోలు క్విస్ ఇంజనీరింగ్ కళాశాల, మలినేని సుశీలమ్మ మహిళా ఇంజనీరింగ్ కళాశాల, ఎ వన్ గ్లోబల్ ఇంజనీరింగ్ కళాశాల, ఒంగోలులోని శ్రీహర్షిణి డిగ్రీ కళాశాల, శ్రీ నాగార్జున డిగ్రీ కళాశాల తదితర కళాశాలలు, ఎస్ఆర్ యూనివర్సిటీ, హోటల్ మేనేజ్మెంట్ కళాశాల, ఫార్మసీ కళాశాల, ప్రత్యేకంగా స్టాల్స్ ఏర్పాటు చేసి విద్యార్థులకు కావాల్సిన సమాచారాన్ని అందించారు. ఎస్‌బిఐ ప్రతినిధులు హాజరై విద్యా రుణాలకు సంబంధించిన విషయాలను వివరించారు.సబ్సిడీ కూడిన ఎడ్యుకేషన్ లోన్స్ మంజూరు చేయుటకు సంసిద్ధత వ్యక్తం చేశారు. బ్రిలియంట్ విద్యా సంస్థ చైర్మన్ న్యాయమతుల్లా భాష మాట్లాడుతూ గత 20ఏళ్లుగా ఈ ఎడ్యుకేషన్ ఫెయిర్ నిర్వహిస్తున్నామని తెలిపారు. రిటైర్డ్ డిజిపి కెఆర్ఎం కిషోర్ కుమార్ లాప్ టాప్ లక్కీ డిప్ కూపన్ల డ్రా తీశారు. విజేతలుగా నిలిచిన ఇద్దరు విద్యార్థులకు ఒక్కొక్కరికి లాప్ టాప్, కంప్యూటర్లను హాజరైన అతిథులు అందజేశారు. కార్యక్రమంలో జనసేన జిల్లా అధ్యక్షులు షేక్ రియాజ్, బ్రిలియంట్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ తహూర, ఒంగోలు క్విస్ ఇంజనీరింగ్ కాలేజీ చైర్మన్ నిడమానూరి నాగేశ్వరరావు, హర్షిణి విద్యా సంస్థల చైర్మన్ గోరంట్ల రవికుమార్, నాగార్జున డిగ్రీ కాలేజీ చైర్మన్ రాం ప్రసాద్, ఖలీఫాతుల్లా బాషా, లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ నైనాల రామకృష్ణ, బ్రిలియంట్ కోర్స్ కో ఆర్డినేటర్ కోటేశ్వరరావు, డైరెక్టర్ ఆకీల్, ఈవెంట్ మేనేజర్ నాగార్జున పాల్గొన్నారు.

అభివృద్ధి, విభజన సమస్యల పరిష్కారం చంద్రబాబుతోనే సాధ్యం

ప్రజాశక్తి - భట్టిప్రోలు


తూనుగుంట్ల సాయిబాబా

రాష్ట్రం జగన్మోహన్‌రెడ్డి ఐదేళ్ల పాలనలో అభివృద్ధిలో 30ఏళ్లు వెనక్కి వెళ్లిందని, దాని పరిష్కారం చంద్రబాబుతోనే సాధ్యమని టిడిపి రాష్ట్ర కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబా అన్నారు. రాష్ట్ర అభివృద్ధి, విభజన సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి చంద్రబాబు చూపిస్తున్న చొరవ అభినందనీయం అన్నారు. సిఎం హోదాలో చంద్రబాబు ఢిల్లీ పర్యటన చేపట్టి ప్రధానమంత్రితో పాటు వివిధ శాఖల మంత్రులను కలిసి రాష్ట్ర సమస్యలు, వాటి పరిష్కారానికి అవసరమైన నిధుల గురించి చర్చించారని అన్నారు. గత ఐదేళ్లలో జగన్మోహన్‌రెడ్డి 30సార్లు ఢిల్లీ పర్యటనలు చేపట్టి ప్రధానమంత్రి, హోం మంత్రిని కలిసి తనపై ఉన్న కేసులపై చర్చించడమే సరిపోయిందని ఆరోపించారు. చంద్రబాబు ఒక్క పర్యటనతోనే రాష్ట్రానికి అవసరమైన రాజధాని అభివృద్ధి, పోలవరం నిర్మాణం, పాలనకు అవసరమైన నిధులను సాధించడానికి చేసిన కృషి, కేంద్రం సానుకూలంగా స్పందించటం అభినందనీయం అన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో కలిసి విభజన సమస్యలు పరిష్కారానికి చంద్రబాబు చేసిన కృషి, ప్రయత్నం ఇరు రాష్ట్రాల ప్రజలను ఉత్సాహ పరిచిందని అన్నారు. గడిచిన ఐదేళ్లలో రాష్ట్రం అధోగతిపాలైందని ఆరోపించారు. చంద్రబాబు బాధ్యతలు చేపట్టి 30రోజులు కూడా గడవక ముందే రాష్ట్రానికి అన్ని విధాల నిధులు సమకూర్చటం అభివృద్ధికి బాటలు వేయటం, రాష్ట్ర ప్రజల అదృష్టంగా భావిస్తున్నట్లు పేర్కొన్నారు.


వైసిపి నాయకుడు రవితేజకు నివాళులర్పిస్తున్న మోపిదేవి

అనారోగ్యంతో వైసిపి నాయకుడు మృతి

ప్రజాశక్తి - రేపల్లె

మండలంలోని బేతపూడి పంచాయతీ ప్రెసిడెంట్ కుమారుడు ఆలూరి రవితేజ తీవ్ర అనారోగ్యంతో ఆదివారం ఉదయం గుంటూరులోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. విషయం తెలుసుకున్న రాజ్య సభ సభ్యులు మోపిదేవి వెంకటరమణారావు మృతుడు రవితేజ ఇంటికి వెళ్లి మృతదేహానికి నివాళి అర్పించారు. ఆ కుటుంబానికి అండగా ఉంటానని ధైర్యం చెప్పారు.


చెరువులు తలపించేలా దృశ్యం

చెరువును తలపిస్తున్న రోడ్డు

ప్రజాశక్తి - అద్దంకి

పట్టణంలోని కాకానిపాలెం మండపం దగ్గర నుంచి నామ్ ఎక్స్‌ప్రెస్ హైవే దారిలో సెంట్రల్ బ్యాంక్ దగ్గర గుండ్లకమ్మకు ఎత్తైన ప్రదేశం కాకానిపాలెం ఉంటుంది. అలాంటిది కాకానిపాలెంలోని చెరువులు తలపించే విధంగా రోడ్డు మారింది. ఎత్తైన ప్రదేశంలోనే ఇలా నీళ్ళు నిలిచాయంటే రోడ్లు, ఇళ్ల నిర్మాణాల పరిస్థితి ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అధికారులు స్పందించి రోడ్డు కొలతలు తీసి మరుగునీటి సమస్య లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని పట్టణ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు కోరారు. సీజన్ వ్యాధులకు ఎక్కువగా అవకాశం ఉన్న ప్రస్తుత పరిస్థితుల్లో మున్సిపల్ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

షహనాజ్‌కు సమాజ సేవలో డాక్టరేట్

నగర ప్రముఖులచే షహనాజ్‌కు ఘన సత్కారం

ప్రజాశక్తి - ఒంగోలు

సూర్య శ్రీ దివ్యాంగుల చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహరాలు సయ్యద్ షహనాజ్‌కు ఏసియా ఇంటర్నేషనల్ కల్చర్ రీసర్చ్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్‌ను ప్రధానం చేసింది. గత నెల 29న బెంగళూరులోని యూనివర్సిటీలో జరిగిన కార్యక్రమంలో షహనాజ్‌కు డాక్టరేట్ ప్రధానం చేసి అవార్డు కింద రూ.52వేలు అందజేశారు. డాక్టర్ షహనాజ్ ఒంగోలులో సూర్య శ్రీ దివ్య చారిటబుల్ ట్రస్టును నిర్వహిస్తున్నారు. ఎంతో మంది దివ్యాంగులకు ఆశ్రమంలో వసతి కల్పించి వారి బాగోగులను చూసుకుంటున్నారు. ట్రస్టు ఆధ్వర్యంలో తన భర్త షేక్ సర్దార్ భాషతో కలిసి విస్తృతంగా సేవలు నిర్వహిస్తున్నారు. కరోనా వంటి విపత్కర పరిస్థితిలోనూ షహనాజ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎంతో మందికి భోజన వసతి కల్పించారు. ఆమె సేవలను గుర్తించిన యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్ ప్రధానం చేశారు. ఈసందర్భంగా పలువురు ప్రముఖులు అభినందించారు. కార్యక్రమం సంతపేటలోని రంగా భవన్‌లో ఒంగోలు కల్చరల్


షహనాజ్‌ను సత్కరిస్తున్న పట్టణ ప్రముఖులు

మీడియా అసోసియేషన్ నిర్వహించిన సభలో ఒంగోలు నగర అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మారెళ్ళ సుబ్బారావు, సిటిజన్ ఫోరం అసోసియేషన్ అధ్యక్షులు కొల్లా మధు, చైతన్య భారతి అధ్యక్షులు నూకతోటి శరత్ బాబు, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మహిళా విభాగం నాయకురాలు కోటేశ్వరమ్మ, సుజాత, శ్రీదేవి, సుశీల, శివం ఫౌండేషన్ చైర్మన్ గొల్లపూడి శ్రీహరి చౌదరి, డి శ్రీనివాస్, ప్రకాశం జిల్లా ముస్లిం సంక్షేమ సంఘం నాయకులు రఫీ, ఖాదర్ బాషా, మా మూర్తి, శ్రావ్యరెడ్డి పాల్గొన్నారు.

రంగుల అవినీతిపై అధికారుల పరిశీలన

ప్రజాశక్తి - భట్టిప్రోలు

మండల పరిషత్ కార్యాలయానికి రంగుల పేరుతో జరిగిన అవినీతి, అక్రమాలపై కొందరు గ్రామస్తులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదుపై పరిశీలన చేపట్టేందుకు అధికారులు వస్తున్నట్లు సమాచారం. గత వైసిపి పాలనలో మండల పరిషత్తు కార్యాలయానికి ఎలాంటి తీర్మానాలు, అంచనాలు, పరిపాల అనుమతులు లేకుండానే రంగులు, టైల్స్ నిర్మాణం చేపట్టి రూ.లక్షల నిధులు కాంట్రాక్టర్‌కు బిల్లుల రూపంలో అధికారులు అందజేశారు. ముందుగా రూ.14లక్షలు అంచనాగా పనులను ఇతర మండలాల ద్వారా గ్రూప్ సభ్యులకు నామినేషన్ పద్ధతిపై అప్పగించారు. పూర్తి స్థాయిలో పని జరపకుండానే రూ.12లక్షల నిధులు బిల్లులు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. అది కూడా చాలనట్లు మరో రూ.2లక్షలు అదనపు అంచనాలతో పెంచి విడుదల చేశారు. పూర్తి స్థాయిలో పనులు జరపటానికి ముందుగా అనుకున్న ప్రకారం కాకుండా కాంట్రాక్టర్ మధ్యలోనే పనులు నిలిపివేసి వెళ్లిపోయినప్పటికీ అతనికి ఏ విధంగా బిల్లులు మంజూరు చేస్తారని పలువురు ప్రశ్నిస్తున్నారు. దీనిలో పంచాయతీరాజ్ శాఖ ఎఇల కాంట్రాక్టర్‌తో కుమ్మక్కై పనులు పూర్తి కాకుండానే బిల్లులు చేసినట్లు ఎంపీటీసీలు ఆరోపిస్తున్నారు. అదే కాంట్రాక్టర్ అద్దేపల్లిలో షాదీ ఖానా అభివృద్ధి, వెల్లటూరు చిన్నరేవు వద్ద దళితుల స్మశాన వాటికకు అవసరమైన వంతెన నిర్మాణం చేపట్టారు. ఈ పనులు కూడా అధికారుల పర్యవేక్షణ లేకుండానే నాణ్యత లోపంగా ఉన్నట్లు ఆరోపిస్తున్నారు. అధికారం ఉంది


భట్టిప్రోలు మండల పరిషత్ కార్యాలయం

కదాని పాలవర్గ సభ్యులు, అధికారులు సైతం గుత్తేదారునికి అన్ని రకాలుగా అండదండలు ఇవ్వడంతో పూర్తి స్థాయిలో పనులు జరగకుండానే బిల్లులు సొమ్ము చేసుకుని వెళ్లినట్లు వ్యాఖ్యానిస్తున్నారు.

రూ.లక్షలు వెచ్చించినా నిరుపయోగమే

మండల పరిషత్ కార్యాలయం నుండి రూ.లక్షల నిధులు వెచ్చించి రంగులు, పనులు పూర్తి చేసినప్పటికీ నిరుపయోగమైందని ప్రజలు ఆగ్రహారం వ్యక్తం చేస్తున్నారు. కార్యాలయంలో మరుగుదొడ్ల నిర్మాణం, నీటి వసతి, మరుగు నీటిపారుదల సౌకర్యం వంటివి చేపట్టకుండానే వదిలేసిన వ్యక్తికి రూ.లక్షల నిధులు ఏ విధంగా బిల్లులు జారీ చేస్తారని ప్రశ్నిస్తున్నారు. పలువురు గ్రామస్తులు చేసిన ఫిర్యాదు మేరకు ఉన్నతాధికారులు చిత్తశుద్ధితో పరిశీలన చేపడితే దీనిలో జరిగిన అవినీతి అక్రమాలు వెలుగు చూస్తాయని, తద్వారా బాధ్యులైన వారిపై చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.


ఎంపికి వినతి పత్రం అందిస్తున్న వికలాంగులు

వికలాంగులకు ఉపకరణాలు అందజేయాలి

ఎంపీ కృష్ణ ప్రసాద్‌కు వికలాంగుల వినతి

ప్రజాశక్తి - బాపట్ల

పార్లమెంటు నియోజకవర్గం పరిధిలో దివ్యాంగులకు ప్రభుత్వం అందజేసే ఉపకరణాలను అందజేయాలని కోరుతూ జనసేన దివ్యాంగుల విభాగం నాయకులు ఆదిశేషు ఎంపీ తెన్నేటి కృష్ణ ప్రసాద్ ఆదివారం వినతి పత్రం అందజేశారు. ట్రై సైకిళ్ళు, బ్యాటరీ వాహనాలు, సంక కర్రలు, స్టిక్స్, వీల్‌చైర్స్, బధిరులకు చెవిటి మిషన్లు, సెల్ ఫోన్లు, అందులకు స్టిక్స్, ఇతర ఉపకరణాలతో పాటు చదువుకొని నిరుద్యోగులుగా ఉన్న దివ్యాంగులకు ఉపాధి కల్పనకు బ్యాంకు రుణాలు, కేంద్ర ప్రభుత్వం వికలాంగులు అందజేసే ప్రత్యేక నిధులను అర్హులైన వికలాంగులకు అందజేయాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో బాల సుందర్, దివ్యాంగుల హక్కుల పోరాట సమితి నియోజకవర్గ అధ్యక్షులు కంది వెంకటరెడ్డి, లక్ష్మి, దండుబోలు వీరాజు, వినీత్ పాల్గొన్నారు.


చిన్నారులను ఆశీర్వదిస్తున్న అశోక్ బాబు

చిన్నారులకు అశోక్‌బాబు ఆశీర్వాదం

ప్రజాశక్తి - వేమూరు

చుండూరు మండలం కేంద్రంలో గ్రామానికి చెందిన భత్తుల కిరణ్ కుమార్తె ఓణీల ఫంక్షన్‌లో వైసిపి ఇన్చార్జి వరికూటి అశోక్ బాబు పాల్గొని చిన్నారులను ఆదివారం ఆశీర్వదించారు. 8న సోమవారం డాక్టర్ వైఎస్ఆర్ జయంతిని అన్ని మండలాల్లో ఘనంగా నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు, కొల్లూరు మాజీ ఎంపీపీ పెరికల పద్మారావు, పలువురు వైసిపి నాయకులు పాల్గొన్నారు.

పాత కక్షల నేపథ్యంలో కాపుకాచి వ్యక్తిపై దాడి

• పట్టపగలే వ్యక్తిపై ఘాతుకం • బాధిత వ్యక్తి పరిస్థితి విషమం • మెరుగైన చికిత్స కోసం గుంటూరు జిజిహెచ్‌కు తరలింపు

ప్రజాశక్తి - రేపల్లె

పాత గొడవల నేపథ్యంలో దారికాచి వ్యక్తిపై దాడి చేసిన ఘటన మండలంలోని శివారు అరవపల్లి రోడ్డులో ఆదివారం ఉదయం జరిగింది. స్థానికులు, బాధితుల సమాచారం మేరకు మండలంలోని ఊలుపాలెం గ్రామానికి చెందిన ఖైతేపల్లి నాగరాజుకు అదే గ్రామానికి చెందిన మరి కొందరితో పాత గొడవలు ఉన్నాయి. ఈ క్రమంలో ఆటో డ్రైవరైన నాగరాజు ప్రయాణికులను ఎక్కించుకు నల్లూరుపాలెం నుండి రేపల్లెవైపు వెళుతున్న క్రమంలో అరవపల్లి గ్రామం శివారులోనికి రాగానే దారికాచి ఉన్న కొందరు వ్యక్తులు ఆటోను అడ్డగించారు. పరిస్థితిని గమనించిన కైతేపల్లి నాగరాజు ప్రాణ భయంతో


దుకాణం వద్ద దాడి చేస్తున్న దృశ్యం

రోడ్డు ప్రక్కన ఉన్న చికెన్ షాపులోకి వెళ్లి తలుపులు వేసుకున్నాడు. అయితే దాడికి పాల్పడ్డ వ్యక్తులు తలుపులను బద్దలు కొట్టి నాగరాజును బయటికి లాగి కర్రలు, ఇనుప రాడ్లతో విచక్షణా రహితంగా కొట్టి గాయపరిచారు. తీవ్రంగ గాయపడ్డ బాధితుడిని స్థానికులు రేపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం తెనాలి ప్రభుత్వ ఆసుపత్రికి వైద్యులు రిఫర్ చేశారు. అక్కడి నుండి గుంటూరు తరలించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అయితే బాధితుడు గతంలో వివిధ కేసుల్లో నిందితుడిగా ఉన్నాడు. నిందితులపై కేసు నమోదు చేసినట్లు సీఐ నజీర్ బేగ్ తెలిపారు.

సాహితీ త్రివేణి సంగమం నాగసూరి

ప్రజాశక్తి - అద్దంకి

పట్టణంలోని శ్రీ శ్రీనివాస ఆర్య వైశ్య కళ్యాణ మండపంలో పుట్టంరాజు బుల్లెయ్య, రామ లక్ష్మమ్మ సాహిత్య పురస్కార సభ ఆదివారం నిర్వహించారు. ఈ సభకు పద్యకవి డివిఎం సత్యనారాయణ అధ్యక్షత వహించారు. నంబూరి బాలభార్గవి ప్రార్థనా గీతంతో సభ ప్రారంభమైంది. లక్కరాజు శ్రీనివాసరావు సభ ఆహ్వానం పలికారు. నంబూరి హనుమంతరావు పురస్కార గ్రహీతను పరిచయం చేశారు. వక్తలు మాట్లాడుతూ అక్షర తూణీరం నాగసూరి వారని, వెలుగు చూడని గ్రంథాలను వెలికితీసి, అందులో ఆంతర్యాన్ని ఈ నాటి తరానికి అందచేస్తున్న సాహితీ వేత్త వేణుగోపాల్ అని, నడుస్తున్న ఓ విజ్ఞాన సర్వస్వం నాగసూరి అని, నిత్య చైతన్యం ఆయన లక్షణమని పుట్టంరాజు శ్రీరామచంద్ర మూర్తి, శైలజ అన్నారు. ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో చప్పిడి



నాగసూరి దంపతులను సన్మానిస్తున్న సాహితీ ప్రతినిధులు

వీరయ్య, నాగసూరి హనుమప్రసాదు, నాగసూరి నాగేశ్వరరావు, నాగసూరి వెంకట సుబ్బారావు, నాగసూరి శివప్రసాదు, చుండూరి మురళీసుధాకరరావు, వామరాజు వేంకటేశ్వరరావు, చిన్నిమురళీకృష్ణ, కుందా సుబ్బారావు, కారుమంచి రమణ, కూరపాటి రామకోటేశ్వరరావు సాహితీ మిత్ర మండలి పక్షాన పురస్కార గ్రహీతను సత్కరించారు. రోటీ క్లబ్ ఘనంగా నాగసూరి దంపతులను సన్మానించారు. గాంధీజీ మార్గం నేటికీ అనుసరణీయమని డాక్టర్ నాగసూరి వేణుగోపాల్ తెలిపారు. మీడియా రంగం అతి ధోరణులను విడనాడి సమాజ హితంగా ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో గాడేపల్లి దివాకర దత్తు, డాక్టర్ యు దేవపాలన, అన్నమనేని వెంకటరావు, మారం కోటేశ్వరరావు, ఆర్‌వి రాఘవరావు, పొన్నూరి శ్రీనివాసులు, లక్కరాజు శ్రీనివాసరావు, వారణాసి రఘురామశర్మ, జి హరనాథ్ బాబు, మలాది శ్రీనివాసరావు, మహమ్మద్ రఫీ, అంజాద్ భాష, సందిరెడ్డి శ్రీనివాసరావు, మారం కోటేశ్వరరావు, కందికట్ల సత్యం మాష్టారు, పసుపులేటి ఆంజనేయులు, సామంతపూడి హనుమంతరావు, నిమ్మరాజు నాగేశ్వరరావు, ధేనువకొండ సుబ్బారావు, అంగలకుర్తి ప్రసాదు పాల్గొన్నారు.


ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలు

ఉపాధి కూలీలకు అందని వేతనాలు

ప్రజాశక్తి - భట్టిప్రోలు

ఏడాది లక్ష్యానికి అనుగుణంగా ఉపాధి హామీ పథకం పనులు జరిగినప్పటికీ పనులు చేసిన కూలీలకు పూర్తిస్థాయిలో వేతనాలు అందలేదు. డెల్టా ప్రాంతంలో ఏప్రిల్, మే, జూన్ నెలలో మాత్రమే కూలీలకు పనులు జరిపేందుకు అవకాశం కలుగుతుంది. మార్చి నెల వరకు రబీ పంట ఉండటంతో పనులు చేపట్టేందుకు వీలులేదు. దీని దృష్ట్యా ఏప్రిల్, మే నెలలో పనులు జరిపిన వారికి ఇంకా ఒక్కొక్కరికి నాలుగు నుండి ఐదు వారాల వరకు వేతనాలు రావాల్సి ఉందని కూలీలు వాపోతున్నారు. ఏ రోజుకు ఆ రోజు కూలి పని చేసుకుని జీవించే కూలీలకు నెలల తరబడి వేతనాలు అందకపోతే ఏ విధంగా జీవించాలంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జూన్ నెలలో వర్షాలు ప్రారంభం కావడంతో పనులు కూడా నిలిచిపోయాయి. ఏప్రిల్ నెల నుండి రానున్నాయి. మార్చి నెల వరకు పనులు జరిగేందుకు అవకాశం ఉన్నప్పటికీ ఈ ప్రాంతంలో సాధ్యపడదు. ఖరీఫ్, రబి పని సీజన్లు పూర్తయితే తప్ప ఉపాధి హామీ పనులు జరిపించే పరిస్థితి లేదని ఉపాధి మేట్లు చెబుతున్నారు. ఉపాధి హామీ పథకంలోని ఫీల్డ్ అసిస్టెంట్లు కూలీలతో పనులు జరిపించేందుకు సిద్ధంగా ఉన్నప్పటికీ ఆమేరకు ప్రభుత్వం నుండి అనుమతులు రాకపోవడం కూడా కొంత లక్ష్యం కనిపిస్తుంది. పనులు జరిపించడానికి మంజూరు కాకపోయినప్పటికీ చేసిన కూలీలకైనా వేతనాలు వెంటనే విడుదల చేస్తే వ్యసులు బాటు కలుగుతుందని కూలీలు కోరుతున్నారు. నూతన ప్రభుత్వ పాలనలోనైనా కూలీల వేతనాలు బ్యాంకు ఖాతాలో జమయ్యే విధంగా అధికారులు, ప్రజా ప్రతినిధులు చొరవ చూపాలని కోరుతున్నారు.

బాపట్లలో సూపర్ ఫాస్ట్ రైళ్లు ఆపాలి

ఎంపీ కృష్ణప్రసాద్‌కు పౌర సమాఖ్య నేతల వినతి

ప్రజాశక్తి - బాపట్ల

స్థానిక రైల్వేస్టేషన్లో సూపర్ ఫాస్ట్ రైళ్లు ఆపాలని పౌర సమాఖ్య నాయకులు ఎంపీ తెన్నేటి కృష్ణ ప్రసాద్‌ను ఆయన క్యాంపు కార్యాలయంలో ఆదివారం కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ బాపట్లలో కొన్ని సూపర్ ఫాస్ట్ రైళ్ల నిలుపుదలకు అవకాశం కల్పించాలని విజయవాడ డిఆర్ఎం, సికింద్రాబాద్ ఆర్ఎం, బాపట్ల స్టేషన్ మాస్టర్‌తో ఫోన్ ద్వారా మాట్లాడారు. సూపర్ ఫాస్ట్ రైళ్లకు స్టాప్ కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సికిందరాబాద్, తిరుపతి మధ్య నడిచే వందేభారత్ ఎక్స్‌ప్రెస్, హైదరాబాద్, చెన్నై మధ్య నడిచే చార్మినార్ సూపర్ ఫాస్ట్ ఎక్స్ ప్రెస్, చెన్నై, న్యూఢిల్లీ మధ్య నడిచే జిటి ఎక్స్‌ప్రెస్, బెంగళూరు, అగర్తల మధ్య నడిచే హమ్‌సఫర్ ఎక్స్‌ప్రెస్, సికిందరాబాద్, తిరుపతి మధ్య నడిచే పద్మావతి సూపర్ ఫాస్ట్ ఎక్స్ ప్రెస్, తిరుపతి, విశాఖపట్నం మధ్య


ఎంపికి వినతిపత్రం అందిస్తున్న నాయకులు

నడిచే డబల్ డెకర్ ఎక్స్ ప్రెస్‌లను బాపట్ల స్టేషన్‌లో నిలుపుదల అంశంపై ఎంపీ సానుకూలంగా స్పందించారని నాయకులు తెలిపారు. వినతి పత్రం అందజేసిన వారిలో పౌర సమాఖ్య అధ్యక్షులు ప్రొఫెసర్ కె విజయకుమార్, కార్యదర్శి డాక్టర్ బి శరత్‌బోస్, నాళం నరేష్, మామిడి రమేష్, బూర్ల రత్తయ్య, నరాల శెట్టి శ్రీనివాస్, మువ్వల శ్రీనివాస్, బాబు నాగేంద్ర, బ్రహ్మాండం బాల నారాయణ, కొత్ర రామకృష్ణ, న్యాయవాది నటరాజన్ పాల్గొన్నారు.

అత్తింటి ముందు కోడలు బైటాయింపు

పోలీసులను ఆశ్రయించిన బాధితురాలు

ప్రజాశక్తి - చీరాల

కాన్పులో ఇద్దరు ఆడపిల్ల కవలలకు జన్మనిచ్చిందని అత్త మామలు ఇంటిలోనికి రానివ్వకుండా అడ్డు పడటంతో చంటి పిల్లలతో రోడ్డుపైనే ఓ బాలింత నిరసన తెలిపిన ఘటన మండలంలోని కొత్తపాలెంలో ఆదివారం రాత్రి జరిగింది. గ్రామానికి చెందిన శివ సుందరరెడ్డి, నాంచారమ్మ దంపతుల కుమారుడు మణికంఠరెడ్డికి కుసుమాంజలి అనే మహిళతో వివాహం జరిగింది. అయితే మొదటి కాన్పులో ఆడ బిడ్డకు జన్మనిచ్చింది. కుసుమాంజలి భర్త మణికంఠరెడ్డి గత 20రోజుల క్రితం పొలం పని చేస్తూ ప్రమాదవశాత్తు ట్రాక్టర్ కిందపడి మృతి చెందాడు. ఆ పాటికే రెండో కాన్పుకు గర్భంతో ఉన్న కుసుమాంజలికి వారం రోజుల క్రిందట చీరాల్లోని ఓ ప్రైవేట్ హాస్పిటల్లో డెలివరీ అవ్వగా ఇద్దరు కవల ఆడపిల్లలకు జన్మనిచ్చింది. రెండు కాన్పుల్లో ముగ్గురు ఆడపిల్లలు


పురిటి బిడ్డలతో అత్తింటి ముందు కోడలు నిరసన

పుట్టడంతో ఇష్టం లేని అత్త, మామ తనను ఇంటిలోకి రానివ్వడం లేదని ఆమె తన అత్త ఇంటి ముందు కుటుంబ సభ్యులతో నిరసనగా బైఠాయించింది. తనకు న్యాయం చేయాలంటూ పోలీసులను ఆశ్రయించింది. భర్తను కోల్పోయి పుట్టెడు దుఖంలో ఉండగా ముగ్గురు పసిబిడ్డలతో ఉన్న తనను ఇంటిలోనికి రానివ్వకపోవటం ఎంతో బాధాకరమని స్థానికులు మండి పడుతున్నారు.


ఇసుక తవ్వకాలు నిలిపేసిన పోలీసులు

దళితుల భూముల్లో నిలిచిన ఇసుక తవ్వకాలు

'ప్రజాశక్తి' కథనానికి స్పందించిన పోలీసులు

ప్రజాశక్తి - చిన్నగంజాం

మండలంలోని కడవకుదురు ఫ్లై ఓవర్ బ్రిడ్జి కింద ఉన్న దళితుల భూముల్లో ఇసుక ఇసుక తవ్వకాలను ఆదివారం ఎస్ఐ ఎం శ్రీనివాసరావు తన సిబ్బందితో సందర్శించారు. ఇసుక అక్రమార్కుల వాహనాలు ఏమీ లేవని ఎస్ఐ ప్రజాశక్తితో చెప్పారు. 'బరితెగించిన ఇసుక అక్రమార్కులు' శీర్షికతో ప్రజాశక్తిలో కథనం ప్రచురించిన విషయం పాఠకులకు విధితమే. స్పందించిన ఎస్ఐ ఎం శ్రీనివాసరావు పోలీస్ శాఖ ఉన్నత అధికారులు ఆదేశాల మేరకు ఆ భూముల్లోకి తన సిబ్బందితో వెళ్లి పరిశీలించారు. ఇసుక అక్రమార్కులు ఆ భూముల్లో ప్రవేశించకుండా పోలీస్ గస్తీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు.


మురుగు తొలగింపు పర్యవేక్షిస్తున్న మురళీకృష్ణ

మురుగును తొలగింపు

ప్రజాశక్తి - కొల్లూరు

శాసన సభ్యులు నక్క ఆనందబాబు ఆదేశాల మేరకు దోనేపూడి నుండి పంట కాలవలో నిలిచిపోయిన మురుగు, చెత్తను రైతులు సహకారంతో పొలాలకు ఆటంకం లేకుండా ఆదివారం తొలగించారు. నీటి పారుదలకు అడ్డుగా ఉన్న చెత్తను తొలగింగారు. నీటి పారుదలకు అనువుగా చేయడంతో రైతులు, ప్రజలు వర్షాలకు ఇబ్బందులు తొలుగుతాయని సంతోషం వ్యక్తం చేశారు. పనులను తెలుగుదేశం మండల అధ్యక్షులు, కృష్ణా పశ్చిమ డెల్టా ప్రాజెక్ట్ మాజీ చైర్మన్ మైనేని మురళీకృష్ణ పర్యవేక్షించారు.


పాదయాత్రలో ఈపూరు లంకగ్రామాల కార్యకర్తలు

పాదయాత్రకు లంక గ్రామస్తుల మద్దతు

ప్రజాశక్తి - కొల్లూరు

సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేన, బిజెపి కూటమి 164 సీట్లు భారీ విజయాన్ని సాధించిన సందర్భంగా కొల్లూరు నుండి తిరుపతి దేవస్థానం వరకు 60 మంది బృందంతో 14 రోజులు పాటు పాదయాత్ర చేస్తున్న తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ కనకాల మధుసూదన ప్రసాద్, బృందంను ఆదివారం ప్రకాశం జిల్లా సింగరాయకొండలో కొల్లూరు మండలం ఈపూర్ లంక గ్రామస్తులు కలిసి పాదయాత్రలో పాల్గొని, సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో వాసు, మళ్లీ, రత్నబాబు, కైలా పౌల్, మేకతోటి సుధీర్ బాబు, తలకాయల రవి, అంబటి రాజశేఖర్, మేకతోటి బోసు ఉన్నారు



చైనా టూర్ వెళ్లి వచ్చిన బృందం

ప్రజల జీవన ప్రమాణాలు పెరగడం వల్లే చైనా అభివృద్ధి సాధించింది

(మొదటిపేజీ తరువాయి)

సాధారణ కార్మికుడి కుటుంబం ఆదాయం నెలకు లక్షల్లో ఉందన్నారు. వారి కొనుగోలు శక్తి బాగా పెరిగిందని, ఇదే చైనా అభివృద్ధికి, వియత్నాం అభివృద్ధికి దోహదపడ్డాయని తెలిపారు. గడిచిన 30ఏళ్లలో చైనా అనేక రంగాల్లో అభివృద్ధి సాధించిందని తెలిపారు. వియత్నాంలో కూడా అదే స్థాయిలో అభివృద్ధి జరిగిందని తెలిపారు. చైనా, వియత్నాం పర్యటనల్లో పాల్గొన్న సభ్యులు తమ అనుభవాలు, అనుభూతులను పంచుకున్నారు. ఒంగోలుకు చెందిన ప్రొఫెసర్ కె. రవీంద్ర సహకారంతో చైనా టూర్‌ను తాము విజయవంతంగా ముగించుకున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు నగరాభివృద్ధి కమిటీ ప్రధాన కార్యదర్శి భక్త సింగ్ రాజ్, నగర అభివృద్ధి కమిటీ నాయకులు బత్తుల ముసలారెడ్డి, లక్ష్మీ నారాయణ, తిరుపతిస్వామి, ప్రజాశక్తి జీఎం ఎంఎల్‌వి. ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

'దాచూరి' శిబిరానికి విశేష స్పందన

1,505 మంది రోగులకు వైద్యసేవలు

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ఒంగోలు డిఆర్ఆర్ మున్సిపల్ హైస్కూల్‌లో దాచూరి రామిరెడ్డి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. బిపి, షుగర్, ఫిట్స్, పక్షవాతం రోగులకు గత 8 సంవత్సరాలుగా ప్రతి 2 నెలలకొకసారి దాచూరి రామిరెడ్డి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో జిబిఆర్ ఫౌండేషన్ సహకారంతో వైద్య శిబిరం నిర్వహిస్తున్నారు. వైద్య శిబిరంలో డాక్టర్ గోపాలం శ్రీ మన్నారాయణ , డాక్టర్ చాపల వంశీకృష్ణ మాట్లాడుతూ షుగర్, ఎముకల పటుత్వంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు, డాక్టర్ బి. హరిబాబు, డాక్టర్ జాన్ రిచర్డ్స్, డాక్టర్ జి. చైతన్య , డాక్టర్ ఎం. శరత్ , డాక్టర్ రవితేజ , డాక్టర్ ఎస్.దీరజ్ బాబు రోగులకు వైద్య సేవలు అందించారు. వైద్య శిబిరంలో మొత్తం 1,505 మంది రోగులు వైద్య సేవలు పొందారు. ఒపి, టెక్నికల్, ఫార్మసీ, రిజిస్ట్రేషన్, కౌన్సిలింగ్, సర్వీస్ విభాగాలలో 120 మంది వాలంటీర్స్‌గా పనిచేశారు. ఈ సందర్భంగా మెడికల్ క్యాంప్ కన్వీనర్ మాదాల వెంకట్రావు మాట్లాడుతూ సెప్టెంబర్1న మళ్లీ మెడికల్ క్యాంపు నిర్వహించనున్నట్లు తెలిపారు. రెగ్యులర్ మెడికల్ క్యాంపు నిర్వహణ కోసం చీమకుర్తి జవహర్ నర్సింగ్ హోం వైద్యులు డాక్టర్ బి.జవహర్, డాకా సుబ్బారెడ్డి చెరో పదివేల రూపాయలు అందజేసినట్లు ఆయన తెలిపారు. వైద్య శిబిరంలో పాల్గొన్న వైద్యులు, వాలంటీర్లు, దాతలకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు



వైద్యశిబిరానికి హాజరైన రోగులు

13, 14 తేదీల్లో బ్యాడ్మింటన్ ఛాంపియన్ షిప్

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్ : ప్రకాశం జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో లార్డ్‌కృష్ణ బ్యాడ్మింటన్ అకాడమీలో ఈనెల 13, 14 తేదీల్లో జిల్లా బ్యాడ్మింటన్ ఛాంపియన్ షిప్ పోటీలు నిర్వహిస్తున్నట్లు అసోసి యేషన్ జిల్లా కార్యదర్శి పి.విజయకృష్ణ తెలియజేశారు. అండర్-11, 13, 15, 17, 19, పురుషులు, మహిళల విభాగాలలో ఈ పోటీలు జరుగుతాయన్నారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు 9398260109, 8328268419 నెంబర్లల్లో ఎంట్రీలు నమోదు చేసు కోవాలన్నారు. ఎంట్రీ ఫీజు సింగిల్స్‌కు రూ.400, డబుల్స్‌కు రూ.800, రిజిస్ట్రేషన్ ఫీజు రూ. 100 నిర్ణయించినట్లు ఆయన తెలిపారు. ఎంట్రీలను ఈనెల 12 లోపు నమోదు చేసుకోవాలని బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా ఛైర్మన్ అద్దంకి మురళీకృష్ణ, అసోసియేషన్ అధ్యక్షుడు జెఎస్.లక్ష్మణ్ రెడ్డి, కోశాధికారి అశోక్ రెడ్డి, అసోసియేషన్ సభ్యులు తెలిపారు.

డిమాండ్స్ డేను జయప్రదం చేయండి

సిఐటియు జిల్లా కమిటీ పిలుపు

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను ఖండిస్తూ ఈనెల 10న దేశవ్యాప్త డిమాండ్స్ డేలో భాగంగా జిల్లాలో, మండల కేంద్రాల్లో ధర్నా, నిరసనలను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కాలం సుబ్బారావు, ఎం.రమేష్ ఓ ప్రకటనలో తెలిపారు. ఎన్‌డిఎ ప్రభుత్వం మూడో సారి అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్లు అమలుకు పూనుకొంటుందన్నారు. లేబర్ కోడ్స్ అమలైతే కార్మికులు బేరసారాలాడే హక్కులను కోల్పోయి యజమానుల కింద బానిసలుగా పనిచేయాల్సి వస్తుందన్నారు పిఎఫ్ సకాలంలో చెల్లించకుంటే యజమానులపై విధించే పెనాల్టీని 25 నుంచి 5 శాతానికి తగ్గించి తన కార్పోరేట్ ప్రభుభక్తిని చాటుకుందన్నారు. స్కీంవర్కర్లకు కనీస వేతనాలు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించలేదన్నారు. సిపిఎస్ రద్దుచేసి ఒపిఎస్ అమలు చేయకుండా రాష్ట్రాలపైకి నెట్టి చోద్యం చూస్తుందన్నారు. మరో వైపు రాష్ట్రంలో టిడిపి నాయకత్వం లోని ప్రభుత్వం ఎన్నికలలో కార్మికులు, ఉద్యోగులకిచ్చిన హామీలు అమలు చేయకుండా ఉన్న ఉద్యోగాలను ఊడబెరికే ప్రయత్నాలను ముమ్మరం చేస్తుందన్నారు. మధ్యాహ్న భోజన పథకం, స్కూల్ స్వీపర్లు, విఒఎ, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఆశా, మున్సిపల్, అంగన్‌వాడీ, కాంట్రాక్ట్ ఉద్యోగులను మానుకోమని ఒత్తిడి చేస్తున్నారన్నారు. అంగన్‌వాడీలకు ప్రమోషన్స్ వెనక్కి తీసుకోవాలని ఐసిడిఎస్ అధికారులపై ప్రజాప్రతినిధులు ఒత్తిడితెస్తున్నారన్నారు. .సమస్యలు పరిష్కరించి ఉద్యోగ, కార్మిక వ్యతిరేక విధానాలను మానుకోవాలని డిమాండ్ చేస్తూ ఈనెల 10న జిల్లాలో నిర్వహిస్తున్న ధర్నా, నిరసనలలో కార్మికులందరూ పాల్గొనాలని వారు కోరారు.

సేవా కార్యక్రమాలు నిర్వహించాలి

మాజీ మంత్రి శిద్దా రాఘవరావు



మాట్లాడుతున్న మాజీ మంత్రి శిద్దా రాఘవరావు

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

రానున్న కాలంలో వాసవీ క్లబ్ ప్రజలకు మరిన్ని సేవా కార్యక్రమాలు అందించాలని మాజీ మంత్రి శిద్దా రాఘవరావు తెలిపారు. ఒంగోలులోని సాయి ఐటిఎ కన్వెన్షన్ హాలులో ఇంటర్నేషనల్ వాసవీ క్లబ్ ప్రమాణ స్వీకారం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా శిద్దా రాఘవరావు మాట్లాడుతూ వాసవీ క్లబ్ ఒక నిబద్ధతతో కూడిన సంస్థ అని తెలిపారు. ఈ క్లబ్ ద్వారా దేశవ్యాప్తంగా అనేక సేవా కార్యక్ర మాలు నిర్వహిస్తున్నారన్నారు. రానున్న కాలంలో వాసవీ క్లబ్ ద్వారా మరిన్ని సేవలందించాలని ఆకాంక్షించారు. ఒంగోలు పార్ల మెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ వాసవీ క్లబ్ దేశవ్యాప్తంగా చేపడుతున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమన్నారు. రానున్న కాలంలో వాసవీ క్లబ్ మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టి ముందంజ వేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ రవి చంద్రన్, ఉపాధ్యక్షుడు రామకృష్ణ, కార్యదర్శి నాగభూషణం, కోశాధికారి శిద్దా సూర్య ప్రకాశరావు, గోల్డ్ మర్చంట్ అసోసియేషన్ స్టేట్ కన్వీనర్ తాతా ప్రసాద్, ఆత్మకూరి బ్రహ్మయ్య, కనమర్లపూడి హరి ప్రసాద్, పలువురు ప్రముఖులు, వాసవీ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.



బాబును పరామర్శిస్తున్న వి. శ్రీనివాసరావు

బాబుకు విఎస్ఆర్ పరామర్శ

ప్రజాశక్తి- ఒంగోలు సబర్బన్ : ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కెవిఫ్.బాబును సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు ఆదివారం పరామర్శిం చారు. ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. బాబు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. శ్రీనివాసరావు వెంట సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఆంధ్ర మాల్యాద్రి, జిల్లా క్యాదర్శి సయ్యద్ హనీఫ్, జిల్లా నాయకులు ఎస్‌కె.మాబు, కంకణాల ఆంజనేయులు, జి.శ్రీనివాసులు, .బాలకోటయ్య ఉన్నారు.

మెరుగైన వైద్యసేవలే లక్ష్యం

- ఎన్‌టిఆర్ ఆరోగ్యసేవలో 3257 మెడికల్, సర్జికల్ ప్రొసీజర్స్
- అందుబాటులో 130 నెట్‌వర్క్ హాస్పిటల్స్
- 6 లక్షల ఆరోగ్య రక్ష కార్డులు పంపిణీ
- ఎన్‌టిఆర్ ఆరోగ్యసేవ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ పతకమూరి హేమంత్ కుమార్

ముఖాముఖి



ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ఎన్‌టిఆర్ ఆరోగ్య సేవ పథకం ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించటమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు డాక్టర్ పతకమూరి హేమంత్ కుమార్ తెలిపారు, ఎన్‌టిఆర్ ఆరోగ్యసేవలో 3,257 మెడికల్, సర్జికల్ ప్రొసీజర్లు ఉన్నాయన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి నెట్‌వర్క్ హాస్పిటల్స్ ద్వారా శస్త్ర చికిత్సలు అందిస్తున్నామన్నారు. 130 నెట్ వర్క్ హాస్పిటల్స్ ఉన్నట్లు తెలిపారు. ఎన్‌టిఆర్ ఆరోగ్యసేవ ద్వారా ప్రజలకు అందిస్తున్న వైద్య సదు పాయాలను జిల్లా సమన్వయకర్త ప్రజాశక్తికి వివరించారు. అవన్నీ ఆయన మాటల్లోనే....

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఎన్‌టిఆర్ ఆరోగ్యసేవ పథకాన్ని ప్రారంభించింది. ప్రజలకు నాణ్యమైన, కార్పొరేట్ వైద్య సేవలు అందించటమే ఎన్‌టిఆర్ ఆరోగ్యసేవ ముఖ్య లక్ష్యం. రాష్ట్ర ప్రభుత్వం, కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా ఆదేశాల మేరకు ఎన్‌టిఆర్ ఆరోగ్య సేవ పథకం ద్వారా జిల్లా ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించటానికి కృషి చేస్తున్నాం.

3,257 మెడికల్, సర్జికల్ ప్రొసీజర్స్

ఎన్‌టిఆర్ ఆరోగ్యసేవలో సుమారు 3257 మెడికల్, సర్జికల్ ప్రొసీజర్స్ అందుబాటులో ఉన్నాయి. ప్రజలకు అవసరమైన వైద్య చికిత్సలను అందిస్తున్నాం. .

అందుబాటులో 130 నెట్‌వర్క్ హాస్పిటల్స్

జిల్లాలో ఎన్‌టిఆర్ ఆరోగ్యసేవ పథకం ద్వారా ప్రజలకు నాణ్యమైన వైద్యసేవలు అందించేందుకు 130 నెట్‌వర్క్ హాస్పిటల్స్ అందుబాటులో ఉన్నాయి. ఇందులో 41 ప్రైవేట్ హాస్పిటల్స్, 12 ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్(ఈహెచ్‌ఎస్) డెంటల్ హాస్పిటల్స్, 77 పిహెచ్‌సి, సిహెచ్‌సి, ఏరియా హాస్పిటల్స్, జిల్లా ఆసుపత్రులు ఉన్నాయి.. ఆయా నెట్‌వర్క్ హాస్పిటల్స్ పరిధిలో ప్రజలకు రిజిస్ట్రేషన్, వైద్య సేవలు అందించటం, వారికి తిరిగి ఇంటికి పంపించే వరకు ఆరోగ్య మిత్రలు అందుబాటులో ఉన్నారు.

6 లక్షల ఆరోగ్య రక్ష కార్డుల పంపిణీ

దారిద్ర్య రేఖకు దిగువ ఉన్న కుటుంబాలు, బియ్యం కార్డులు కలిగిన వారికి 6 లక్షల ఆరోగ్య రక్ష కార్డులు పంపిణీ చేశారు. ఈ కార్డు కలిగిన వారు ఆయా ఆసుపత్రుల పరిధిలో మెరుగైన వైద్యసేవలు పొందవచ్చు

ఆరోగ్య ఆసరా అందజేత

ఎన్‌టిఆర్ ఆరోగ్య సేవ పథకంలో శస్త్ర చికిత్స చేయించుకున్న వారు ఆసుపత్రిలో ఉన్న రోజులు, తిరిగి కోలుకునేంత వరకు ఆరోగ్య ఆసరా కార్యక్రమంలో నగదును ప్రభుత్వం అందజేస్తుంది. మెడికల్, సర్జికల్ ప్రొసీజర్స్‌ను బట్టి రూ.5 వేలు నుంచి రూ.30 వేలు వరకు అందజేసి రోగులను ప్రభుత్వం ఆదుకుంటోంది.

దీర్ఘకాలిక వ్యాధులకు చికిత్స

ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్(ఈహెచ్‌ఎస్) ద్వారా వివిధ శాఖల ఉద్యోగులకు ఒంగోలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో దీర్ఘకాలిక వ్యాధులకు చికిత్స అందిస్తున్నాం. ప్రభుత్వ సర్వజన వైద్యశాల పిల్లల వార్డులో ఈహెచ్‌ఎస్‌లో సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలను ఉద్యోగుల కోసం అందిస్తున్నాం. రానున్న కాలంలో మరిన్ని మెరుగైన వైద్యసేవలందించేందుకు కృషి చేస్తాం